


E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 13-04-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:101 || పేజీలు–6 www.ekaburu.com



# చర్చలు విఫలం

ఈకబురు,ఇస్లామాబాద్: ప్రపంచమంతా అత్యంత ఆశతో ఎదురు చూసిన అమెరికా, ఇరాన్ చర్చలు చివరికి విఫలమయ్యాయి. పశ్చిమాసియాలో భీకర యుద్ధానికి ముగింపు పలికి శాంతి, సుస్థిరతకు బాటలు వేస్తాయని, శాశ్వత కాల్పుల విరమణకు బాటలు పరుస్తాయని, ఆ మేరకు ఇరు దేశాల నడుమ ఒప్పందం కుదురుతుందని ప్రపంచ దేశాలు పెట్టుకున్న ఆశలు వమ్మే అయ్యాయి.

పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సారథ్యంలోని బృందం, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబఫ్ సారథ్యంలోని ఇరాన్ బృందం మధ్య జరిగిన శిఖరాగ్ర చర్చలు ఎటూ తేలకుండానే అర్థాంతరంగా ముగిశాయి. ఏకధాటిగా 21 గంటలపాటు కొనసాగిన చర్చల్లో అమెరికా, ఇరాన్ ప్రతినిధి బృందాలు ఎవరి డిమాండ్లపై వారు మొండిపట్టు పట్టడంతో ఎలాంటి ఒప్పందమూ సాధ్యపడలేదు. దాంతో ఇరు బృందాలూ ఆదివారమే తమ తమ దేశాలకు వెనుదిరిగాయి. అమెరికా వెళ్లేముందు వాన్స్ ఇస్లామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. చర్చలు విఫలమయ్యాయని స్వయంగా ప్రకటించారు. ''అణు కార్యక్రమాలకు స్వస్తి పలకబోనని ఇరాన్ మొండికేసింది. హార్మూజ్‌పైనా అదే వైఖరి! చర్చల వైఫల్యానికి ఇవి రెండే ప్రధాన కారణాలు. ఇరాన్‌తో 21 గంటలపాటు చర్చలు జరిపాం. కొన్ని అంశాలపై లోతుగా మాట్లాడాం. చర్చలకు సంబంధించి ఇదొక్కటే మంచివార్త. కానీ ఉమ్మడి నిర్ణయానికి మాత్రం రాలేకపోయాం. ఇది అమెరికాకంటే ఇరాన్‌కే అతి పెద్ద దుర్వార్త. అణ్వాయుధం తయారు చేయబోమని ఒక్క నిర్దిష్టమైన, స్పష్టమైన హామీని మాత్రమే కోరాం. అధ్యక్షుడు ట్రంప్ కోరుతున్నది కూడా ఇదే. చర్చల ద్వారా మేం ఇదే సాధించాలనుకున్నాం. చర్చలకు మేం ముందుకు రావడానికి అసలు కారణమూ ఇదే. కానీ మా షరతులకు ఇరాన్ ఒప్పుకోలేదు. చర్చల సందర్భంగా ట్రంప్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఆయన వైఖరిని ఇరాన్ బృందానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వచ్చాం'' అని వాన్స్ చెప్పారు. తమ ప్రతిపాదనలను ఇరాన్ ఇకనైనా ఆమోదిస్తుందో లేదో చూడాలన్నారు. అణ్వస్త్ర తయారీ, హార్మూజ్ జలసంధి ద్వారా సాధారణ రాకపోకలు, విదేశాల్లో దిగ్బంధంలో ఉన్న ఇరాన్ స్థిరచరాస్తులను విడిపించడం వంటి ప్రధానాంశాల్లో సయోధ్య వీలవకపోవడమే చర్చల వైఫల్యానికి కారణమని ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది.

**అసాధ్యమైన డిమాండ్లు: బఘేర్**

చర్చల వైఫల్యంపై ఇరాన్ బృంద సారథి, స్పీకర్ ఘాలిబఫ్ 'ఎక్స్'లో స్పందించారు. ''ఇరాన్ సర్వతోముఖాభివృద్ధికి కోసం దూరదృష్టితో మేం చేసిన పలు ప్రతిపాదనలకు అమెరికా అంగీకరించలేదు. మా బృంద విశ్వాసాన్ని సంపాదించడంలో విఫలమైంది. దాని ఆధిపత్య తరహా దౌత్యమే ఇందుకు కారణం. మాపై సైనిక చర్య నేపథ్యంలో దేశ రక్షణ కోసం 40 రోజులుగా చేస్తున్న పోరాటంలో రాజీ ఉండబోదని కరాఖండిగా చెప్పేశాం. చర్చల సాఫల్యం అవతలి పక్షం అనుకూల వైఖరి, అంకితభావం మీదనే ఆధారపడి ఉంటుంది. అమెరికా మా ముందు ఆచరణ సాధ్యం కాని, అతి, అక్రమ డిమాండ్లు పెట్టింది. ఇలాంటి చర్యలతో చర్చలు ముందుకు సాగబోవు. పరస్పర అవిశ్వాసం, సంశయాల నడుమ సఫలత అసాధ్యం'' అన్నారు. ''ఒకే దఫాలో ఉమ్మడి నిర్ణయం ఆశించడం కష్టం.

మిగతా 2లో



# తుక్డే గ్యాంగ్‌కు మద్దతా?

## ఈశాన్య రాష్ట్రాలను దేశం నుంచి వేరు చేసే కుట్రలకు తృణమూల్ దన్ను

## సిలిగురి ఎన్నికల ప్రచారంలో మోదీ

**ఈ కబురు, సిలిగురి:**

''ఈశాన్య రాష్ట్రాలను దేశంలోని మిగతా భూభాగం నుండి వేరు చేయడానికి కుట్రలు జరుగుతున్నాయి. వ్యూహాత్మక సిలిగురి కారిడార్ (చికెన్ నెక్)ను తెంచేస్తామని తుక్డే-తుక్డే గ్యాంగ్ బెదిరించింది. బుజ్జగింపు రాజకీయాలనే నమ్ముకుంటున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ తుక్డే గ్యాంగ్‌కు గల్లీ నుంచి ఢిల్లీ దాకా మద్దతిచ్చింది. ఇదే ఆ పార్టీ అసలు రంగు'' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురిలో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. ఆ పార్టీ యువత, గిరిజనులు, మహిళల వ్యతిరేకి అని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాల వల్ల బెంగాల్ తీవ్రంగా నష్టపోయిందని, దుర్భర స్థితిలోకి జారుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిలిగురి కారిడార్‌ను దేశ రక్షణకు, శ్రేయస్సుకు మధ్య వారధిగా ప్రధాని అభివర్ణించారు. ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి, పటిష్టంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సిక్కింను సిలిగురితో అనుసంధానించే సేవోక్-రాంగ్‌పో రైల్వే రైల్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టుతో బెంగాల్, సిక్కిం అనుసంధానం ఏర్పడడమే గాక స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం ఊపందుకుంటుందని, యువతకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

మిగతా 2లో

# వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా..



- బీఆర్‌ఎస్‌ను మళ్లీ టీఆర్‌ఎస్‌గా మార్చే ప్రతిపాదన ఉంది
- ఈ విషయంలో అధినేతదే తుది నిర్ణయం
- మంచిర్యాలలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్

**ఈ కబురు, మంచిర్యాల:**

వచ్చే ఏడాది ప్రజాసమస్యలపై పాదయాత్ర చేస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని, గత ఎన్నికల్లో సిట్టింగ్‌లను మార్చిన చాలా చోట్ల గెలిచామన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఇంట్లో మీడియాతో కేటీఆర్ ప్రత్యేకంగా మాట్లాడారు.

మిగతా 2లో



6

## ఆర్సీబీ దంచేసింది ముంబయిపై విజయం

డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ మళ్లీ గెలుపు బాట పట్టింది. వాంఖడేలో దూకుడైన ఆటతో ఐపీఎల్-19లో మూడో విజయాన్నందుకుంది.



6

## గుజరాత్ అలవోకగా... రెండో విజయం



3

## రేపే నీతీశ్‌కుమార్ రాజీనామా!

**ఈ కబురు, పట్నా:**

బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మంగళవారం జరిగే క్యాబినెట్ సమావేశం తర్వాత రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది. అదే ఆయనకు చివరి సమావేశం కానుంది. 14న ఉదయం 11 గంటలకు జరిగే క్యాబినెట్ సమావేశం అనంతరం..



# సుర లోకానికి అమర స్వరం

## ....ప్రఖ్యాత గాయని ఆశా భోంస్లే కన్నుమూత

- ముంబై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- సంతాపం ప్రకటించిన రాజకీయ, సినీ ప్రముఖులు
- నేడు ముంబైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

'ఈనా మీనా డీకా'.. ఆమెది రాక్ ఎన్ రోల్ స్వరం. 'పియా తూ అబ్ తో ఆజా'.. ఆమెది నర్తించే గళం. 'ఆజా ఆజా మై హూ ప్యార్ తేరా'.. ఆమెది యుగళ గీతం. 'దిల్ చీజ్ క్యా హై ఆప్ మేరే జాన్ లీజియే'... ఆమెది బరువైన వేదనా జాలం.

మిగతా 2,5వ పేజీలో

# ఇంటర్‌లో 75.61 శాతం మంది పాస్




- సెకండియర్ జనరల్‌లో రికార్డుస్థాయి ఫలితాలు
- ఫస్టియర్ జనరల్‌లో 66.94 శాతం మంది ఉత్తీర్ణత
- ప్రథమ, ద్వితీయంలో మేడ్చల్ జిల్లాకు అగ్రస్థానం
- పాస్‌శాతంలో అమ్మాయిలదే హవా
- మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
- నేటి నుంచి పునఃలెక్కింపు, పునఃపరిశీలనకు దరఖాస్తులు

రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో ఈసారి రికార్డుస్థాయి ఫలితాలు వచ్చాయి. ద్వితీయ ఇంటర్ జనరల్‌లో గతంలో ఎన్నడూ లేనంతగా ఏకంగా 75.61 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇది గత ఏడాది కంటే 4.18 శాతం అధికం. ఫస్టియర్ జనరల్‌లో గత సంవత్సరంతో పోల్చుకుంటే స్వల్పంగా ఉత్తీర్ణత పెరిగింది. ప్రథమ సంవత్సరంలో 66.94 శాతం మంది పాసయ్యారు. ఒకేషనల్ కోర్సు ఫలితాలను కూడా కలుపుకొంటే ప్రథమ, ద్వితీయ ఇంటర్‌లో వరుసగా 66.20, 70.58 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్‌లోని

మిగతా 2లో



## అమరావతికి క్వాంటమ్ సొబగులు

03

ఈ కబురు, అమరావతి:
దేశంలోనే మొదటి స్వదేశీ క్వాంటమ్ కంప్యూటర్ల టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీలు కృష్ణా జిల్లా గన్నవరంలోని మేధా టవర్స్,

## బ్యారేజీల పునరుద్ధరణకు పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ



02

- వారంలోగా పునరుద్ధరణ డిజైన్లు పూర్తవ్వాలి
- కాళేశ్వరం బ్యారేజీలపై సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

ఈ కబురు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నీటిపారుదల రంగ నిపుణుడు కర్నల్ పరీక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా అత్యున్నత స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## రాజ్యాంగాన్ని నాశనం చేయడమే భాజపా లక్ష్యం

### రాహుల్ గాంధీ ధ్వజం



**ఈ కబురు, ఢిల్లీ:**

రాజ్యాంగాన్ని నాశనం చేయడమే ఆరెస్సెస్, భాజపాల ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశంలో అందరికీ సమాన హక్కులు ఉండటానికి వారు వ్యతిరేకమని ఆరోపించారు. 14న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని

మిగతా 3లో

## ఉగ్రవాదులకు పాస్‌పోర్టులు, ఆధార్

03



## తుక్డే గ్యాంగ్‌కు మద్దతా?



--దోషులు మూల్యం చెల్లించాల్సిందే

బెంగాల్‌లో అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాలని మోదీ అన్నారు. "ప్రగతిని పక్కనపెట్టి బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్న పార్టీలను చిత్తుగా ఓడించాలి. మదర్సాల కోసం తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.6,000 కోట్లు ఇవ్వడమేమిటి? ఉత్తర బెంగాల్‌కు నిధులివ్వకుండా మొండిచెయ్యి చూపారు. గత 15 ఏళ్లలో చేసిన ఖర్చులకు మమత సర్కారు సమాధానం చెప్పాలి. బీజేపీ అధికారంలోకి రాగానే తృణమూల్ కాంగ్రెస్ అవినీతి, అక్రమాలపై దర్యాప్తు జరిపిస్తాం. తప్పు చేసినవారు మూల్యం చెల్లించాల్సిందే. 15 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వ పథకాలు బెంగాల్‌లో అమలు కాకపోవడం దారుణం. తృణమూల్ వైఖరితో ప్రజలు నష్టపోయారు. రాష్ట్రంలో క్రూరమైన ప్రభుత్వం ఉంది. ఆ భయానక పాలన పట్ల జనం విసుగెత్తిపోయారు. దానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు" అని చెప్పారు.

**——బీజేపీకి ఒక్క చాన్స్**

తృణమూల్ నిర్వాకాల వల్ల బెంగాల్‌లోకి అక్రమ వలసలు పోటెత్తాయని మోదీ ఆరోపించారు. "రాష్ట్రంలో చొరబాటుదార్లు తిష్టవేశారు. దాంతో స్థానికంగా జనాభా నిష్పత్తి మారిపోయింది. సామాజిక సమతుల్యం దెబ్బతిన్నది. బెంగాల్ ప్రజల భాష, సంస్కృతుల్లో మార్పులొచ్చాయి. స్థానికుల ఉపాధి, ఉద్యోగాలను చొరబాటుదార్లు కొల్లగొట్టారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే చాలా ఆలస్యం చేసినవాళ్లమవుతాం. అందుకే మన నినాదం 'కమల్ ఖిలావో, ఘుస్పతియా భగావో (కమలానికి ఓటేద్దాం, చొరబాటుదార్లను గెంటేద్దాం)'. ఉత్తర బెంగాల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దామని కేంద్రం సంకల్పిస్తే మమత సర్కారు సహకరించలేదు. బీజేపీ అధికారంలోకి రాగానే ఉత్తర బెంగాల్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తాం. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు, క్యాన్సర్ ఆసుపత్రి, ఫ్యాషన్ డిజైన్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తాం. బెంగాల్‌లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు, తృణమూల్‌కు అవకాశమిచ్చారు. ఈసారి బీజేపీకి ఒక్క చాన్సిచ్చి చూడండి. ఆడబిడ్డలకు భద్రత కల్పించడానికి, చొరబాటుదార్ల నుంచి విముక్తి కల్పించడానికి, యువతకు ఉద్యోగాలు కల్పించడానికి, పెట్టుబడులు తీసుకురావడానికి, చట్టబద్ధ పాలన స్థాపించడానికి, పేదలకు ఉచితంగా వైద్యం అందించడానికి, ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి, బుజ్జగింపు రాజకీయాల బారి నుంచి బెంగాల్ సంస్కృతిని కాపాడడానికి మాకు అవకాశమివ్వండి" అని బెంగాలీలకు ప్రధాని విజ్ఞప్తి చేశారు.

## వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా..

విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కవిత పార్టీ ఏర్పాటుపై స్పందిస్తూ.. ఏ ఇంట్లోనైనా కన్నవారిని ఎవరూ ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించకూడదని, ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉందన్నారు. అయితే వ్యక్తిగత కారణాలతో పార్టీ పెడితే నిలబడదని పేర్కొన్నారు. పార్టీ ఏర్పడి 25 ఏళ్లు అవుతోందని బీఆర్ఎస్‌కు ఉద్యమంలో, అధికారంలో, ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో పనిచేసిన అనుభవం ఉందని చెప్పారు.

బీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్‌గా..

బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చే ప్రతిపాదన ఉందని, తుది నిర్ణయం అధినేతదే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని తెలిపారు. జిల్లాల ఏర్పాటులో ఎక్కడైనా ప్రజా సౌకర్యాల మేరకు స్థానిక మార్పులు చేస్తే అంగీకరిస్తామని, అయితే జిల్లాలను ఎత్తివేస్తామంటే ఊరుకోబోమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో లోపాలు జరిగాయని, ఉత్తర తెలంగాణలో ప్రవాసులు అధికంగా ఉండే జిల్లాల్లో గల్ఫ్ పాలసీ తీసుకురాకపోవడంతో పాటు, స్థానిక నాయకులను కలుపుకోకపోవడం, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే కేంద్రంగా పనిచేయడం వంటి లోపాలు జరిగాయన్నారు. తెలంగాణ బొగ్గు గని కా౹ఁక సంఘాన్ని పునర్నిర్మిస్తామని తెలిపారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది ఓ భ్రమ మాత్రమేనని.. 40 ఏళ్లలో ఎంతమంది జైలుకు వెళ్లి సీఎంలు అయ్యారని ప్రశ్నించారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ల చేరిక పార్టీకి మరింత బలాన్నిస్తుందని తెలిపారు. పార్టీలో ఆధిపత్య పోరు లేదని, అధ్యక్షుడు ఎలాంటి వర్క్ ఇస్తే, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆ వర్క్ చేస్తానన్నారు. తాను ఆల్‌రౌండర్‌ను అని, వయసుకు మించి బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

## చలికాలం తగ్గుతోంది..
# వేడి తీవ్రత పెరుగుతోంది



ఈ కబురు, హైదరాబాద్: దేశంలో వాతావరణ పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. ఉష్ణోగ్రతలను తగ్గించి వాతావరణాన్ని చల్లగా మార్చే లానినో ప్రభావం ఉన్నప్పటికీ, గ్లోబల్ వార్మింగ్ దాన్ని అధిగమిస్తోంది. ఫలితంగా 2026లో శీతాకాలం ముందే ముగిసి.. ఫిబ్రవరిలోనే వేడిగాలులు మొదలయ్యాయని క్లైమేట్ ట్రెండ్స్ నివేదిక తెలిపింది. 2025లోనూ ఫిబ్రవరిలో శీతాకాలం ఆకస్మికంగా ముగిసిపోవడంతో దేశవ్యాప్తంగా సాధారణాన్ని మించి అధిక ఉష్ణోగ్రతలు మొదలయ్యాయని పేర్కొంది. మరోవైపు ఫిబ్రవరిలో ఈ ఏడు వర్షపాతం లోటు 81 శాతంగా నమోదయిందని..శీతాకాలం క్షీణతను ఇది సూచిస్తోందని వివరించింది.

1901 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రత

సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో మొదలయ్యే వేడిగాలుల (హీట్‌వేవ్స్) పరిస్థితులు ఈసారి మార్చి నెలలోనే కనిపించడం ఆందోళన కలిగిస్తోందని క్లైమేట్ ట్రెండ్స్ నివేదికలో పేర్కొంది. నివేదికలోని ముఖ్యాంశాలిలా..

ఉత్తర, మధ్య భారతదేశంలో ముందుగానే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు పెరిగాయి. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ ప్రభావం ఉంది. ఇది పంటలపై ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా, నీటి అవసరాన్ని కూడా పెంచుతోంది. ఏసీలు, కూలర్లతో విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి.

గ్లోబల్ వార్మింగ్‌తో సహజ శీతల (లానినో) ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. 1901 తర్వాత 2025 ఎనిమిదో అత్యధిక ఉష్ణోగ్రతల సంవత్సరంగా నమోదైంది.

ఉష్ణోగ్రతలతోపాటు గాలిలో తేమ కూడా పెరగడంతో 'వెట్ బల్బ్ టెంపరేచర్' స్థాయిలు పెరుగుతున్నాయి. శరీరం చెమట ద్వారా చల్లబడే సామర్థ్యం తగ్గిపోతోంది. ముఖ్యంగా తీర ప్రాంతాలు, మెట్రో నగరాల్లో హీట్ స్ట్రెస్, డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి అనారోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. వృద్ధులు, చిన్నపిల్లలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు ఎక్కువ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది.

19912020 వరకు నమోదైన సగటు ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకుంటే 2025లో దేశంలో ఉష్ణోగ్రతలు సగటున 0.28 డిగ్రీలు పెరిగాయి. ప్రధానంగా గత 11 సంవత్సరాల కాలంలో వరుసగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవడం గ్లోబల్ వార్మింగ్ తీవ్రతను చూపిస్తోంది. ముంబయిలో మార్చి 10న 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 7.6 డిగ్రీలు ఎక్కువ. ఢిల్లీలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు. ఇది సాధారణం కంటే 57 డిగ్రీలు ఎక్కువ.

దేశవ్యాప్తంగా ఫిబ్రవరిలో సాధారణ వర్షపాతం 22.7 మి.మీ కాగా..2025 ఫిబ్రవరిలో నమోదైన వర్షపాతం కేవలం 4.2 మి.మీ మాత్రమే.

సముద్రం కూడా వేడెక్కుతోంది. గతంలో కంటే సముద్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భవిష్యత్తులో ఇంకా ఎక్కువగా పెరిగే అవకాశం ఉంది.



# చర్చలు విఫలం

పలుమార్లు చర్చల తర్వాత బహుశా ఇరు పక్షాల వైఖరిలో కాస్త సారూప్యత సాధ్యపడొచ్చు" అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయెల్ బఖాయీ అభిప్రాయపడ్డారు. మలి దఫా చర్చలపై యోచిస్తున్నట్టు అతిథ్య పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ ప్రకటించారు. 1979లో ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌తో అమెరికా జరిపిన తొలి ప్రత్యక్ష చర్చలు ఇవే కావడం తెలిసిందే. ఇస్లామాబాద్‌లో శనివారం మొదలైన ఈ చర్చల్లో అమెరికా తరఫున వాన్స్‌తో పాటు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, పశ్చిమాసియాలో అధ్యక్షుని దూత స్టీవ్ విట్కాఫ్; ఇరాన్ తరఫున బఘేర్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ; మధ్యవర్తిత్వ దేశ హోదాలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చర్చల్లో పాల్గొన్నారు. పశ్చిమాసియా నుంచి అమెరికా సేనల నిష్క్రమణ, హార్ముజ్‌పై పట్టు వంటి 10 కీలక డిమాండ్లతో ఇరాన్; అణ్వస్త్ర తయారీకి తక్షణం అడ్డుకట్టే ప్రధాన డిమాండ్‌గా వాన్స్ బృందం పాక్‌లో

లెబనాన్‌పై ఆగని దాడులు

బీరూట్: లెబనాన్‌తో మంగళవారం చర్చలు జరపనున్నా, ఆ దేశంపై దాడులను మాత్రం ఇజ్రాయెల్ ఆపడం లేదు! ఆదివారం దక్షిణ లెబనాన్‌లోని మారౌబ్ గ్రామంపై దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. లెబనాన్‌పై దాడులను పోప్ లియో–14 తీవ్రంగా ఖండించారు. మరోవైపు 40రోజులపాటు జరిగిన యుద్ధంలో ఇప్పటిదాకా ఇరాన్‌లో 3,375 మంది ప్రాణాలు కోల్పోయారని ఇరాన్ ఫోరెన్సిక్ మెడిసన్ ఆర్గనైజేషన్ ఆదివారం ప్రకటించింది. మృతుల్లో 500 మంది దాకా మహిళలున్నారు. ఇప్పటిదాకా యుద్ధంలో లెబనాన్‌లో 2,055 మంది, ఇజ్రాయెల్‌లో 23 మంది, గల్ఫ్‌దేశాల్లో డజను మందికిపైగా చనిపోయారు.

## సుర లోకానికి అమర స్వరం

**'ఈనా మీనా డీకా'.. ఆమెది రాక్ ఎన్ రోల్ స్వరం. 'పియా తూ అబ్ తో ఆజా'.. ఆమెది నర్తించే గళం. 'ఆజా ఆజా మై హూ ప్యార్ తేరా'.. ఆమెది యుగళ గీతం. 'దిల్ చీజ్ క్యా హై ఆప్ మేరే జాన్ లీజియే'... ఆమెది బరువైన వేదనా జాలం. ఆశా భోంస్లే. డాన్సింగ్ వాయిస్ ఆఫ్ ఇండియా. నర్తించే గళం. 12000 పాటలు పాడి దశాబ్దాల పాటు భారతీయ శ్రోతల జీవితాల్లో హుషారును నింపి నేడు స్వరసుర లోకానికి బయలుదేరింది. దివ్య పుష్పమై దేవలోక 'లత'కు చేరింది. బాలీవుడ్ గోల్డెన్ ఎరా ముగింపుకొచ్చింది. ఆశా భోంస్లే మరణ వార్త విని అభిమానులు చేస్తున్న వేడుకోలు– 'అభీనా జావో ఛోడ్‌కర్ కె దిల్ అభీ భరా నహీ'....**

ఈ కబురు ;

దశాబ్దాలుగా శ్రోతలను అలరించిన అద్భుత గాత్రం మూగబోయింది. కోట్లాది అభిమానులను ఉర్రూతలూగించిన అసమాన స్వర ఝరి శాశ్వతంగా ఆగిపోయింది. ప్రఖ్యాత గాయని ఆశా భోంస్లే తుదిశ్వాస విడిచారు. 92 ఏళ్ల ఆశా చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఛాతీలో ఇన్ఫెక్షన్‌తోపాటు శ్వాస సంబంధిత సమస్యతో శనివారం రాత్రి ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారని ఆశా భోంస్లే మనవరాలు జనై భోంస్లే ప్రకటించారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో ఆశా అంత్యక్రియలు జరగనున్నాయి. ఉదయం 11 గంటలకు లోయర్ పరేల్‌లోని కాసా గ్రాండ్‌లో అభిమానులు ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పించవచ్చని కుమారుడు ఆనంద్ తెలిపారు. ఆశా మృతి పట్ల పలువురు రాజకీయ, సినీ రంగ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సంతాపం ప్రకటించారు. లెజెండరీ సింగర్ దూరం కావడం చిత్ర పరిశ్రమలకు, అభిమానులకు తీరని లోటు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**సుదీర్ఘ కాలం పాడిన రికార్డు**

ఆశా భోంస్లే 1933 సెప్టెంబర్ 8న మహారాష్ట్రలోని సాంగ్లీలో సంప్రదాయ మరాఠీ కుటుంబంలో జన్మించారు. ఆమె సోదరీమణుల్లో ప్రముఖ గాయని లతా మంగేష్కర్, ఉషా మంగేష్కర్, మీనా మంగేష్కర్, సోదరుడు హృదయనాథ్ మంగేష్కర్ ఉన్నారు. తండ్రి దీనానాథ్ మంగేష్కర్ ప్రోత్సాహంతో ఆశ సంగీతం నేర్చుకున్నారు. 1943లో పదేళ్ల వయసులో మరాఠీ చిత్రం 'మజా బల్'లో



తొలి గీతం ఆలపించారు. 2010 దశకం వరకూ పాడుతూనే ఉన్నారు. సుదీర్ఘ కాలం పాటలు పాడిన సింగర్‌గా రికార్డుకెక్కారు. గాయనిగా ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 2000 సంవత్సరంలో దాదాసాహెబ్ ఫాల్కే, 2008లో పద్మభూషణ్, 2018లో బంగ భూషణ్, 2021లో మహారాష్ట్ర భూషణ్ అవార్డులు ఆమెను వరించాయి. జాతీయ అవార్డులు, గౌరవాలకు లెక్కేలేదు. ఆశా భోంస్లే 1949లో 16 ఏళ్ల వయసులోనే గణపతిరావు భోంస్లేను వివాహం చేసుకున్నారు. ముగ్గురు పిల్లలు పుట్టాక వారు విడిపోయారు. అనంతరం ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఆర్.డి.బర్మన్‌ను పెళ్లాడారు. 80 ఏళ్లలో 14 భాషల్లో 12,000కు పైగా పాటలతో అభిమానులను రంజింపజేశారు. యాదోం కీ బారాత్, హమ్ దోనో, హరే రామ హరే కృష్ణ, డాన్, నమక్ హలాల్, ఉమ్రావ్ జాన్, కిస్మత్, మేరా సాయా, తీస్రీ మంజిల్, మేరా జీవన్ సాథీ తదితర చిత్రాల్లో ఆశ పాడిన పాటలు దశాబ్దాలుగా సంగీత ప్రియులను అలరిస్తూనే ఉన్నాయి. ఆశ వంట కూడా అద్భుతంగా చేస్తారన్న పేరుంది. 'ఆశాస్'పేరిట ఇంటర్నేషనల్ రెస్టారెంట్ చైన్‌ను ఏర్పాటు చేశారు. చాలా దేశాల్లో రెస్టారెంట్లు నెలకొల్పారు.

**భారతీయ సంగీతాన్ని సుసంపన్నం చేశారు: ముర్ము**

ఆశా భోంస్లే మరణం సంగీత ప్రపంచంలో ఒక తీరని లోటును సృష్టించిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దిగ్గజ గాయనిగా ఆశ సాగించిన అద్భుత ప్రస్థానం భారత సంగీత చరిత్రలో ఒక యుగాన్ని సృష్టించిందని కొనియాడారు. ఆమెతో వ్యక్తిగతంగా సంభాషించిన తీపి జ్ఞాపకాలు తనకున్నాయని వెల్లడించారు. మధురమైన, చిరస్థాయిగా నిలిచిపోయే స్వరంతో దశాబ్దాల పాటు భారతీయ సంగీతాన్ని సుసంపన్నం చేశారని ప్రశంసించారు. ఆమె సంగీతం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆశా భోంస్లే వైవిధ్యమైన స్వరం అభిమానులకు చిరకాలం గుర్తుండిపోతుందని ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. అన్ని రకాల పాటలు, హృద్యమైన గజల్స్, సంప్రదాయ భజనలతో ఆకట్టుకున్నారని తెలిపారు.

## బ్యారేజీల పునరుద్ధరణకు పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ



ఈ కబురు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నీటిపారుదల రంగ నిపుణుడు కర్నల్ పరీక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా అత్యున్నత స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సచివాలయంలో అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించి మాట్లాడారు. 'పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ కమిటీ వారానికి రెండుసార్లు సమావేశాలు నిర్వహిస్తుంది. అవసరమైతే నేను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొంటా. రోజూ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ), విజిలెన్స్ కమిషన్ తదితర చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించాయి. ఈ మూడు బ్యారేజీల్లోనూ సమస్యలు ఒకేవిధంగా ఉన్నాయి. వీటి మరమ్మతుల ప్రక్రియలో 2027, 2028 సంవత్సరాలను అధికారులు కీలకంగా పరిగణించాలి. నిర్దేశిత గడువులోనే అన్నారం, సుందిళ్ల పనులు పూర్తవుతాయి. అదే సమయంలో మేడిగడ్డ కొంత భాగాన్నీ పూర్తి చేస్తామన్న నమ్మకం ఉంది. బ్యారేజీల పునరావాస డిజైన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆఫ్రి ఇండియాకు బాధ్యతలు అప్పగించింది.

వారం రోజుల్లో డిజైన్ల ప్రక్రియను పూర్తి చేయాలి. ఆ తర్వాత వెంటనే వాటిని కేంద్ర జల సంఘా (సీడబ్ల్యూసీ)నికి పంపించి ఆమోదం తీసుకోవాలి. నిర్మాణ సంస్థలు ఈ విషయంలో ఏవైనా సందేహాలుంటే నీటిపారుదలశాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, కర్నల్ పరీక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలి. ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలి. డిజైన్ల ప్రక్రియకు సంబంధించి భూభౌతిక, భూసాంకేతిక, మట్టి, హైడ్రాలిక్ మోడలింగ్ వంటి అన్ని అధ్యయనాలు సమగ్రంగా నిర్వహించాలి. బ్యారేజీల వద్ద పరీక్షలు, అధ్యయనాలు చేపడుతున్న పుణెకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) సిబ్బంది ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కేంద్ర జల సంఘంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అనుమతులు పొందాలి. 45 రోజులపాటు నిరంతరం పరీక్షలు నిర్వహించేలా బ్యారేజీల ప్రాంతాల్లోనే ఉండాలి. వారికి నిర్మాణ సంస్థలు పూర్తి సహకారం అందించాలి' అని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈఎన్సీలు రమేశ్‌బాబు, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, సీడబ్ల్యూపీఆర్ఎస్ అదనపు సంచాలకుడు సెల్వాబాలన్, సీఈ శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు

# ఇంటర్‌లో 75.61 శాతం మంది పాస్

ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఆదివారం ఉదయం ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, సీజీజీ డైరెక్టర్ జనరల్ రవిగుప్తా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ పరీక్షల్లో పాసైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. తప్పిన వారు చింతించవద్దని, మళ్లీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ అవకాశం ఉందన్నారు. పుస్తకంలో ఉన్నది మాత్రమే కాకుండా బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే అసలు నాలెడ్జి అని అభిప్రాయపడ్డారు. యోగితా రాణా మాట్లాడుతూ ఇంటర్ విద్యాశాఖ కృషి వల్ల ఈసారి ప్రభుత్వ కళాశాలల్లో కూడా ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. శ్రీదేవసేన మాట్లాడుతూ సోమవారం దోస్త్ నోటిఫికేషన్ విడుదలవుతుందని, దాని ద్వారా డిగ్రీలో ప్రవేశాలు పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఇంటర్‌బోర్డు పరీక్షల కంట్రోలర్ జయప్రద బాయి, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, వసుంధర, మోహన్, జ్యోత్స్నా రాణి, భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

మేడ్చల్ హవా..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం(జనరల్) ఫలితాల్లో మేడ్చల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ జిల్లాలో ఫస్టియర్‌లో 77.31 శాతం, సెకండియర్‌లో 82.73 శాతం మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరంలో 76.38 శాతంతో రంగారెడ్డి, 73.04 శాతంతో భూపాలపల్లి జిల్లాలు రెండు, మూడు స్థానాలను పొందాయి. ద్వితీయ సంవత్సరంలో 82.34 శాతంతో భూపాలపల్లి, 82.16 శాతంతో ఆసిఫాబాద్ జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. రెగ్యులర్‌తోపాటు ఒకేషనల్, ఒకసారి తప్పిన వారిని కూడా కలుపుకొంటే.. ఫస్టియర్‌లో మేడ్చల్(77.02 శాతం), రంగారెడ్డి(75.69 శాతం), జయశంకర్ భూపాలపల్లి 72.19 శాతం ఉత్తీర్ణతతో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. 48.10 శాతం ఉత్తీర్ణతతో మహబూబాబాద్ చివరి స్థానంలో నిలిచింది. సెకండియర్‌లో 81.95 శాతంతో భూపాలపల్లి జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించింది. 81.68 శాతంతో ములుగు, 80.57 శాతంతో ఆసిఫాబాద్ వరుసగా రెండు, మూడు స్థానాలను పొందాయి. 55.68 శాతంతో సిరిసిల్ల చివరి స్థానానికి పరిమితమైంది. అభివృద్ధిలో వెనకబడిన జిల్లాలు ఉత్తీర్ణతలో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

--ఫస్టియర్‌లో 3.23 లక్షలు.. సెకండియర్‌లో 3.58 లక్షలు

ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 4,89,123 మంది పరీక్షలు రాయగా.. వారిలో 3,23,807 మంది పాసయ్యారు. వారిలో 75, అంతకంటే ఎక్కువ శాతం మార్కులతో పాసైన వారు(ఏ గ్రేడ్) 2,10,380 మంది ఉన్నారు. ఇక 5,07,948 మంది సెకండియర్ పరీక్షలు రాయగా.. వారిలో 3,58,490 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 2,33,299 మంది ఏ గ్రేడ్ సాధించారు.

**——మే 13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు**

**తప్పిన విద్యార్థుల కోసం మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 13 నుంచి 20 వరకు ఆ పరీక్షలు రాసేందుకు, రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్ నుంచి ఫీజు చెల్లించవచ్చన్నారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ.100, రీ వెరిఫికేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చెల్లించాలి. వాటిని టీజీబీఐఈ వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చు. సప్లిమెంటరీ ఫీజు మాత్రం ఆయా కళాశాలల ద్వారా చెల్లించాలి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో పాసైతే రెగ్యులర్‌గా పాసైనట్లే భావిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలు మే 22 నుంచి జరుగుతాయి.**

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను

# కలిసిన పల్లపు సురేందర్


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన సురేందర్


నల్లగండ్ల డివిజన్ సమస్యలపై డిప్యూటీ సీఎంతో సురేందర్ సమావేశం

**నల్లగండ్ల డివిజన్ సమస్యలపై ఉపముఖ్యమంత్రితో సమావేశం**

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆదివారం నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రగతి భవన్ కు తరలి వెళ్లిన పల్లపు సురేందర్ డివిజన్ సమస్యలపై భట్టి విక్రమార్కతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, చేపట్టవలసిన అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం పల్లపు సురేందర్ మాట్లాడుతూ నల్లగండ్ల డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, డివిజన్ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి పనుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించినట్లు తెలిపారు. నల్లగంట్ల డివిజన్ పరిధిలో అభివృద్ధి చెందిన గేటెడ్ కమ్యూనిటీ లతోపాటు నేటికీ అభివృద్ధికి నోచుకోని బస్తీలు ఉన్నాయని, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించాలని కోరారు. డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. దీంతోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు జరుగుతున్న అన్యాయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నల్లగండ్ల డివిజన్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, సామాజిక న్యాయం కోసం పాటుపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజు నాయక్ తో పాటు డివిజన్ పరిధిలోని పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జ్యోతీరావ్ పూలే చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలే..


తెల్లాపూర్‌లో మహత్మా జ్యోతీరావ్ పూలే నాటికను ప్రదర్శిస్తున్న సిందూర కల్చరల్ ట్రూప్


తెల్లాపూర్‌లో మహత్మా జ్యోతీరావ్ పూలే నాటికను ప్రదర్శిస్తున్న సిందూర కల్చరల్

- సమానత్వం, విద్యా విప్లవానికి నాంది పలికిన మహనీయుడు పూలే
- తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత కొల్లూరి భరత్
- తెల్లాపూర్‌లో ఘనంగా పూలే 199 వ జయంతి వేడుకలు
- హాజరైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్


పూలే జయంతి వేడుకలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ భరత్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తదితరులు

ఈ-కబురు, పటాన్‌చెరు :
మహాత్మా జ్యోతీరావ్ పూలే చూపిన మార్గంలో నేటి యువత నడవాలని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ యువ నాయకుడు కొల్లూరి భరత్ పిలుపునిచ్చారు. పూలే 199 వ జయంతిని పురస్కరించుకొని తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ వద్ద శనివారం రాత్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొల్లూరి భరత్‌తో పాటు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, వివిధ కుల సంఘాల పెద్దలు, ఐక్య వేదిక సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒంగోలుకు చెందిన సిందూర కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా జ్యోతీరావ్ పూలే చరిత్రాత్మక సంగీత నృత్య నాటకం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొల్లూరి భరత్ మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. సమాజంలో అందరికీ సమానత్వం, సమాన హక్కులు అందించేందుకు ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి పాటు పడ్డారని అన్నారు. నిమ్న వర్గాల బాలికలకు విద్యను అందించాలనే లక్ష్యంతో 1848లో పూనేలో మొదటి పాఠశాలను స్థాపించారని, ఆయన సామాజికాభివృద్ధికి చేసిన కృషి ప్రపంచం ఎప్పటికీ మరవదని పేర్కొన్నారు. పూలే లాంటి సంఘసంస్కర్త ఆశయాలను నేటి తరం యువత తెలుసుకొని ముందుకు నడవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. పూలే జీవిత చరిత్ర తెలిసిన ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో నడుస్తారని, పూలే భారత సామాజిక విప్లవ యోధుడని పేర్కొన్నారు. పూలే బ్రతికున్న కాలానికి తీసుకెళ్లిన నాటిక సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నగేశ్ యాదవ్, సీపీ రెడ్డి, గుల్లి రవీందర్, శ్రీను, బీసీ కులాల ఐక్య వేదిక సభ్యులు పి కుమార్ గౌడ్, నాయక్‌వాడి కృష్ణ, పి ఐలేష్ యాదవ్, రమేష్ యాదవ్, వడ్ల శ్రీశైలం, విజయ్, పాండు, కోటె రాజు, మన్నె వెంకటయ్య, విష్ణు, కుమ్మరి వెంకటయ్య, మంగలి శ్రీనివాస్, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ నగర్ బొడ్రాయి పండుగ.. వేడుకల్లో పాల్గొన్న ఆంజనేయులు సాగర్


పోచమ్మ అమ్మవారి ప్రత్యేక పూజల్లో ఆంజనేయులు సాగర్


స్థానికులతో కలిసి బొడ్రాయి వేడుకల్లో ఆంజనేయులు సాగర్

**పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ బస్తిలో ఆదివారం బొడ్రాయి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బస్తి వాసుల ఆహ్వానం మేరకు అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ ఈ వేడుకలకు హాజరై నల్ల పోచమ్మ దేవాలయంలో అమ్మవారి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బస్తి వాసులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ, మన సంప్రదాయాలు, సంస్కృతి మన సమాజానికి బలమైన పునాది అని, దేవాలయాలు భక్తి, ప్రజల మధ్య ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇటువంటి పండుగలు మన మధ్య స్నేహభావాన్ని పెంపొందించి సమాజాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని, సమాజ అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించిన బస్తి వాసులను అభినందిస్తూ, అందరిపై అమ్మవారి కరుణ, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి. లక్ష్మయ్య సాగర్, నాయకులు అల్లకుంట తిరుపతయ్య, గోలుసుల నర్సింహ, నర్రా సాయులు, పి. పాండు, పి. యాదయ్య, పి. వెంకటేశ్వర్లు, పి. దశరథ్, ఈ. రాజు, కే. జోగులు, జి. రాము, డి. యాదయ్య, డి. శ్రీను, బి. వెంకటేష్, ఏ. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని నాశనం చేయడమే భాజపా లక్ష్యం



ఈ కబురు, దిల్లీ:
రాజ్యాంగాన్ని నాశనం చేయడమే ఆరెస్సెస్, భాజపాల ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశంలో అందరికీ సమాన హక్కులు ఉండటానికి వారు వ్యతిరేకమని ఆరోపించారు. 14న బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని 'రన్ ఫర్ అంబేడ్కర్, రన్ ఫర్ కాన్‌స్టిట్యూషన్' పేరుతో కాంగ్రెస్ ఎస్సీ విభాగం తలపెట్టిన ఒక మారథాన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'అంబేడ్కర్ దేశానికి ఇచ్చిన సందేశమే రాజ్యాంగం. ఆ ఆలోచనలు దేశం నలుచెరగులా ప్రచారం కావాలన్నదే మా ఉద్దేశం. అందుకే ఈ కార్యక్రమం. రాజ్యాంగ విలువలపై తీవ్రమైన దాడి జరుగుతున్న ఈ సమయంలో మనమంతా ఐక్యంగా ఉండాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్ పాల్గొన్నారు.

## రేపే నీతీశ్‌కుమార్ రాజీనామా!



గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్‌కు నీతీశ్ తన రాజీనామా పత్రాన్ని సమర్పించే అవకాశముంది. బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ సోమవారం తర్వాత ప్రారంభమవుతుందని జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా తెలిపారు. ఎన్డీఏ శాసనసభ్యులు కొత్త నేతను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. పట్నాలో నీతీశ్‌ను ఆదివారం కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి, జేడీయూ సీనియర్ నేత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌధరి ఉన్నారు. బిహార్‌లో ఎన్డీయే పక్ష నేతను ఎన్నుకునే కార్యక్రమానికి పరిశీలకుడిగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవహరించనున్నారు. ఆయనను నియమిస్తూ భాజపా అధిష్ఠానం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

# అమరావతికి క్వాంటమ్ సొబగులు



**ఈ కబురు, అమరావతి:**

**దేశంలోనే మొదటి స్వదేశీ క్వాంటమ్ కంప్యూటర్ల టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీలు కృష్ణా జిల్లా గన్నవరంలోని మేధా టవర్స్, రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయాల్లో ప్రారంభం కానున్నాయి. ప్రపంచ క్వాంటమ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 14న రెండు క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్‌స్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. దేశంలోనే క్వాంటమ్ టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. పూర్తి స్వదేశీ సాంకేతికతతో భారత్‌లోనే తొలిసారి క్వాంటమ్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి.. ధ్రువీకరించే సామర్థ్యం అమరావతి క్వాంటమ్ వ్యాలీకి రానుంది. అమరావతిలో ఏర్పాటు చేస్తోన్న రెండు క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశీ ఉపకరణాలనే వినియోగించారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సుమారు 1.5 లక్షల మంది విద్యార్థులు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, పరిశోధకుల కోసం ఓపెన్ యాక్సెస్ ప్రాతిపదికన క్వాంటమ్ రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీని ఏర్పాటు చేశారు.**

# ఉగ్రవాదులకు పాస్‌పోర్టులు, ఆధార్

**నకిలీ గుర్తింపు పత్రాలు సమకూరుస్తున్న ముఠా గుట్టు రట్టు**

**ఐదుగురిని అరెస్టు చేసిన కశ్మీర్ పోలీసులు**

**ఈ కబురు, శ్రీనగర్/ దిల్లీ:**



దేశంలో మరో భారీ ఉగ్రవాద నెట్‌వర్క్ గుట్టు రట్టైంది. ఉగ్రవాదులకు పాస్‌పోర్టు, ఆధార్, ఓటరు కార్డు, పాన్ కార్డు తదితర నకిలీ గుర్తింపు పత్రాలను సమకూరుస్తూ సాయం చేస్తున్న ముఠాను జమ్మూ కశ్మీర్ పోలీసులు ఛేదించారు. ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబాతో సంబంధాలున్న ఈ ముఠా కార్యకలాపాలు పలు రాష్ట్రాల్లో విస్తరించినట్లు అధికారులు తెలిపారు. గత నెల 31 నుంచి కేంద్ర నిఘా సంస్థలు, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఐదుగురిని అరెస్టు చేశారు. 2012 తర్వాత భారత్‌లోకి చొరబడిన పాక్ ముష్కరుడు ఉమర్ అలియాస్ ఖర్గోష్ 2024లో రాజస్థాన్‌లోని జైపుర్‌లో నకిలీ పాస్‌పోర్టు సంపాదించినట్లు అధికారులు చెప్పారు. దాని సాయంతో ఇండోనేసియాకు పారిపోయి, అక్కడి నుంచి మరో నకిలీ గుర్తింపు పత్రంతో గల్ఫ్‌కు వెళ్లి దాక్కున్నట్లు అధికారులు భావిస్తున్నారు. 16 ఏళ్ల పాటు పరారీలో ఉన్న పాక్ ఉగ్రవాది అబ్దుల్లా, మరో పాక్ జాతీయుడు ఉస్మాన్ అలియాస్ ఖుబైబ్‌లను ఈ ఆపరేషన్‌లో అరెస్టు చేయడం కీలక విజయంగా శ్రీనగర్ పోలీసులు పేర్కొన్నారు. విచారణలో అబ్దుల్లా వెల్లడించిన వివరాలవల్లే ఈ ఉగ్రవాద నెట్‌వర్క్ గురించి తెలిసిందన్నారు. శ్రీనగర్‌కు చెందిన మహమ్మద్ నఖీబ్ భట్, అదిల్ రషీద్ భట్, గులాం మహమ్మద్‌లు అరెస్టైన వారిలో ఉన్నారు. వారు విదేశీ ఉగ్రవాదులకు ఆశ్రయం, ఆహారం, సహాయం అందించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఉగ్ర స్థావరాల నుంచి మూడు ఏకే47 తుపాకులు సహా వివిధ ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# పసిడిని కేంద్రబ్యాంకులు కొంటూనే ఉన్నాయ్

### ఫిబ్రవరిలో నికరంగా 19 టన్నులు



పసిడి ధర పరుగులు పెట్టడానికి, వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు పెద్దమొత్తంలో పసిడి నిల్వలు పెంచుకోవడమూ ఒక కారణమన్నది తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు నికరంగా 19 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయని ప్రపంచ స్వర్ణమండలి (డబ్ల్యూజీసీ) తెలిపింది.కొనుగోలుదార్లువిక్రయదార్ల వివరాలు: పోలండ్ 20 టన్నులు, ఉజ్బెకిస్థాన్ 8, చెక్ రిపబ్లిక్ 2, మలేషియా 2, చైనా కాంబోడియా 1 టన్ను చొప్పున కొనుగోలు చేయగా, టర్కీ 8 టన్నులు, రష్యా 6 టన్నుల చొప్పున పసిడిని విక్రయించాయి.2025 ఫిబ్రవరిలో 29 టన్నులు కొనుగోలు చేసిన పోలండ్ కేంద్రబ్యాంక్ మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ రికార్డుస్థాయిలో పసిడిని పోగుచేసుకుంది. మొత్తం బంగారం నిల్వలను 700 టన్నులు చేయాలన్నది ఈ బ్యాంక్ లక్ష్యం కాగా, ఇప్పటికి 570 టన్నులు చేసింది. చైనా విదేశీ మారకపు నిల్వల్లో బంగారం వాటా 10%. ఈ దేశ కేంద్రబ్యాంక్ వద్ద మొత్తం 2,308 టన్నుల బంగారం ఉంది. బంగారాన్ని కొనుగోలు చేయడం చెక్ రిపబ్లిక్‌కు వరుసగా ఇది 36వ నెల కాగా, చైనాకు 16వ నెల, ఉజ్బెకిస్థాన్‌కు 5వ నెల.

# ఈ నెలలో వెనెజువెలా నుంచి 12 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు

### 2020 తర్వాత ఇదే భారీ పరిమాణం



ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించాక, పశ్చిమాసియా నుంచి చమురుగ్యాస్ దిగుమతులు తగ్గడంతో, మనదేశం చురుగ్గా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులను భారత్ పెంచుతోందని, నౌకా రవాణా పరిశీలనా సంస్థ కెప్లర్ తెలిపింది. ఈ నెలలో వెనెజువెలా నుంచి 12 మిలియన్ బ్యారెళ్ల కంటే ఎక్కువ ముడిచమురు మన దేశానికి చేరుకోనుంది. 2020 ఫిబ్రవరి తర్వాత ఇదే అతిపెద్ద పరిమాణం. గత ఆరేళ్లలో వెనెజువెలా నుంచి భారత్ కొనుగోలు చేసిన అత్యధిక పరిమాణ ముడిచమురూ ఇదే.

**అమెరికా ఆంక్షలు సడలించడంతో..:** ఏప్రిల్‌లో భారత్‌కు చేరుకుంటున్న చమురు దిగుమతులు, పశ్చిమాసియాలో సంక్షోభం ప్రారంభం కావడానికి ముందు ఒప్పందాలు చేసుకున్నవి కావొచ్చని కెప్లర్ లీడ్ రీసెర్చ్ అనలిస్ట్ సుమిత్ రిటోలియో పేర్కొన్నారు. 'వెనెజువెలా చమురు కొనుగోళ్లు, భారత తక్షణ ప్రతిస్పందన మాత్రమే కాదు. దీర్ఘకాలిక వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. గతంలో వెనెజువెలా నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు కొనుగోలు చేసేది. ఆ దేశంపై అమెరికా ఆంక్షలు విధించాక, అక్కడనుంచి మనదేశానికి దిగుమతులు తగ్గిపోయాయి. ఈ ఏడాది జనవరిలో వెనెజువెలా అధ్యక్షుడు మదురోను బంధించిన అమెరికా, ఆ దేశ చమురు విక్రయాలపై ఆంక్షలు సడలించింది. దీంతో మనదేశమూ కొనుగోళ్లను పునరుద్ధరించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహిస్తున్న సిక్కా పోర్టుకు 1 మిలియన్ బ్యారెళ్ల వెనెజువెలా ముడిచమురుతో ఒట్టోమన్ సిన్సియారిటీ నౌక చేరుకుంది. గతేడాది కాలంలో వెనెజువెలా నుంచి భారత్‌కు వచ్చిన మొదటి షిప్‌మెంట్ ఇదే. వెనెజువెలా ప్రభుత్వ సంస్థ పీడీవీఎస్ఏ నుంచి నేరుగా చమురు కొనుగోలు చేయడానికి అమెరికా నుంచి రిలయన్స్ అనుమతి పొందింది. గతంలో విటోల్ గ్రూప్, ట్రాఫిగురా వంటి మధ్యవర్తుల నుంచి చమురు వచ్చేది. కానీ ఇప్పుడు నేరుగా దిగుమతి చేసుకుంటోంది. వెనెజువెలాకు చెందిన హెవీ క్రూడ్ వల్ల డీజిల్, విమాన ఇంధనం వంటి ఉత్పత్తులు అధికంగా లభిస్తాయని, ప్రస్తుత సమయంలో ఇవి చాలా కీలకమని రిటోలియా వివరించారు.

**--ఇరాన్ నుంచి ముడి చమురు దిగుమతికి ప్రభుత్వ అనుమతి కోరిన ఆర్ఐఎల్**

ఇరాన్ ముడిచమురు విక్రయానికి అమెరికా ఇచ్చిన ఆంక్షల మినహాయింపు గడువు ఈనెల 19న ముగియనుంది. ఈ లోపుగానే 4 నౌకల్లో ఇరాన్ ముడి చమురు దిగుమతి చేసుకోవడానికి భారత ప్రభుత్వ అనుమతిని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) కోరినట్లు సంబంధితులు తెలిపారు. అమెరికా ఆంక్షలకు అనుగుణంగా, మనదేశ చట్టాలను ఉల్లంఘించకుండా ఉండేలా ఆర్ఐఎల్ జాగ్రత్త వహిస్తున్నట్లు సమాచారం. ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌కు మినహాయింపులు మంజూరు చేయడం వల్లే, ఏడేళ్ల తరవాత భారతీయ రిఫైనరీలు రష్యా చమురు కొనుగోళ్లను ప్రారంభించాయి. వార్తాసంస్థ బ్లూమ్‌బర్గ్ సంకలనం చేసిన నౌకల కదలికల డేటా ప్రకారం.. గత నెలలో మాస్కో నుంచి రోజుకు సుమారు 1.9 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు భారతదేశానికి చేరుకుంది. ఫిబ్రవరిలో ఆ దేశం నుంచి వచ్చింది రోజుకు సుమారు 1.1 మి.బ్యారెళ్లే. రష్యా చమురుపైనా ఆంక్షలు తొలగించడం ఇందుకు నేపథ్యం. ఇరాన్ చమురు విషయానికి వస్తే, ఆంక్షలతో ముడిపడి ఉన్న సరఫరాదారులు, మధ్యవర్తులు, చెల్లింపు విధానాలపై ఉన్న ఆందోళనల కారణంగా ఇరాన్ నుంచి కొనుగోళ్లకు పరిమిత ఆదరణ మాత్రమే లభించింది. మన దేశం ఇరాన్ నుంచి తాజాగా చమురు, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ కొనుగోలు చేస్తోందని చమురు మంత్రిత్వ శాఖ ఈ నెల ప్రారంభంలో 'ఎక్స్' పోస్టులో తెలిపింది.

# దీర్ఘకాలిక లాభాలకు మంచి తరుణం టాటా మ్యూచువల్ ఫండ్

ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు మంచి అవకాశాన్ని తీసుకొచ్చాయని టాటా మ్యూచువల్ ఫండ్ పేర్కొంది. మూలాలు బలంగా ఉన్న కంపెనీల షేర్లు ఇప్పుడు మెరుగైన ధరలకే అందుబాటులోకి వచ్చాయని, 'బాటమ్‌అప్' పెట్టుబడి విధానానికి ఇది సరిగ్గా సరిపోతుందని వివరించింది. టాటా స్మాల్‌క్యాప్ ఫండ్‌లో ఏకమొత్తం, స్విచ్‌ఇన్ దరఖాస్తుల ద్వారా తాజా పెట్టుబడులను తిరిగి అనుమతిస్తున్నట్లు ప్రకటించింది. స్మాల్‌క్యాప్ విభాగంలో మూలధన వినియోగాన్ని, నగదు లభ్యతను (లిక్విడిటీని) సమర్థంగా నిర్వహించేందుకు గతంలో ఈ ఫండ్ హౌస్, ఏకమొత్తం పెట్టుబడులపై తాత్కాలికంగా ఆంక్షలు విధించింది. పటిష్టమైన బ్యాలెన్స్ షీట్లు, స్థిరమైన వృద్ధి రేటు ఉన్న వ్యాపారాలను గుర్తించగలిగిన సామర్థ్యం తమ సొంతమని, దీర్ఘకాలంలో మంచి లాభాలను అందించే షేర్లను పోర్ట్‌ఫోలియోలో చేర్చుకునేందుకు అవకాశం వచ్చిందని టాటా అసెట్ మేనేజ్‌మెంట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఆనంద్ వరదరాజన్ పేర్కొన్నారు.

# క్యాన్సర్ మందుల ధరలకు రెక్కలు?

**–50% పెంపు కోసం ఎన్‌పీపీఏను ఆశ్రయించిన ఔషధ కంపెనీలు**

**–ప్లాటినం ధర 6 నెలల్లో 60 శాతం పెరగడమే కారణం**

**–కార్బోప్లాటిన్, ఆగ్జాలిప్లాటిన్, సిస్‌ప్లాటిన్ తయారీలో ఈ లోహ వినియోగం**




ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం, అంతకుముందు అంతర్జాతీయంగా సంభవించిన పరిణామాల ఫలితంగా క్యాన్సర్ మందుల ధరలు పెరిగే ముప్పు కనిపిస్తోంది. కొన్ని రకాల క్యాన్సర్ మందుల తయారీలో వినియోగించే ప్లాటినం లోహం ధర 6 నెలల్లోనే 60% పెరగడం ఇందుకు కారణం. కార్బోప్లాటిన్, ఆగ్జాలిప్లాటిన్, సిస్‌ప్లాటిన్ మందులను క్యాన్సర్ బాధితులకు కీమోథెరపీ చికిత్సలో వినియోగిస్తారు. ఈ మందుల తయారీలో ప్లాటినం లోహాన్ని వినియోగిస్తారు. ప్లాటినం ధర గణనీయంగా పెరిగినందున, పాత ధరలకు ఈ మందులను విక్రయించలేమని.. ధరలు కనీసం 50% పెంచాలని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ)కి పరిశ్రమ వర్గాలు నివేదించినట్లు తెలుస్తోంది.

**--2013 నుంచే ప్రభుత్వ నియంత్రణ....**

సహజంగానే క్యాన్సర్ మందుల ధర అధికంగా ఉంటుంది. అయితే దేశీయంగా క్యాన్సర్ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, సామాన్యులకూ అందుబాటులో ఉంచేందుకు.. కొన్ని ముఖ్యమైన క్యాన్సర్ మందులను కేంద్ర ప్రభుత్వం ధరల నియంత్రణ జాబితాలో చేర్చింది. ప్లాటినం ఆధారిత ఔషధాల ధరలపై 2013 నుంచి ప్రభుత్వ నియంత్రణ కొనసాగుతోంది.

**--తెలుగు రాష్ట్రాల కంపెనీలూ తయారు చేస్తున్నాయ్...** యుద్ధాలు, ఇతర కారణాల వల్ల అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలు కుప్పకూలి, గత రెండేళ్లలో ఎన్నో రకాల ముడిపదార్థాల ధరలు పెరిగాయి. విలువైన లోహాలు.. బంగారం, వెండి, ప్లాటినం ధరలు బాగా పెరిగాయి. 2025 సెప్టెంబరు వరకు ఒక గ్రాము ప్లాటినం ధర దేశీయంగా రూ.3,800 దరిదాపుల్లో ఉంది. కానీ ఈ ఏడాది జనవరిలో రూ.8,500కు చేరినా, మళ్లీ కాస్త తగ్గి ఇప్పుడు రూ.6,200 వద్ద ఉంది. అంటే 6 నెలల్లోనే 60% మేర ఈ లోహ ధర పెరిగింది. అందువల్లే ఈ ఔషధాల విక్రయ ధర పెంచాలని ఫార్మా కంపెనీల ప్రతినిధులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న డాక్టర్ రెడ్డీస్, నాట్కో ఫార్మా, ఎంఎస్ఎన్ ల్యాబ్స్, హెటిరోతో పాటు సిప్లా, ఇంటాస్, జైడస్ లైఫ్‌సైన్సెస్, ఎంక్యూర్ ఫార్మా వంటి ఫార్మా కంపెనీలు ఈ మందులు తయారు చేస్తున్నాయి. కార్బోప్లాటిన్ 10గ్రా/ఎంఎల్ వయల్‌ను రూ.61.10కి మించి విక్రయించడానికి లేదు. సిస్‌ప్లాటిన్ ధర రూ.75నుంచి రూ.400 వరకు ఉంది. ఆగ్జాలిప్లాటిన్ ఇంజెక్షన్ 50 ఎంజీ ధరపై రూ.2,303కి పరిమితి ఉంది. ప్లాటినం ధరల పెరుగుదల కారణంగా, ప్రభుత్వ ధరల పరిమితుల్లో ఈ ఔషధాలు తయారు చేయలేమని భావిస్తున్న ఔషధ కంపెనీలు, జనవరి నుంచే ఆచితూచి వ్యవహరిస్తున్నాయని సమాచారం .ఈ ఔషధాలకు రూ.110 కోట్ల మార్కెట్ ఉంది. ఏటా వీటి అమ్మకాలు 14% పెరుగుతున్నాయి.

**--అందుబాటులో ఉంచడానికే ధరలపై పరిమితి....**

మెటాలిక్ ఏపీఐలుగా వ్యవహరించే (ప్లాటినంతో తయారు చేసే) కీమోథెరపీ మందులను సాధ్యమైనంత తక్కువ ధరల్లోనే అందుబాటులో లభించేలా చూసేందుకే ప్రభుత్వం వీటిపై గరిష్ఠ విక్రయ ధర పరిమితులను విధించింది. ఈ మందులను రొమ్ము, గొంతు, ఊపిరితిత్తులు, పొట్టలో వచ్చే క్యాన్సర్ వ్యాధులకు చికిత్సలో వినియోగిస్తున్నారు. 2013 నుంచి కార్బోప్లాటిన్ మందు ధర ఇప్పటి వరకు 20 శాతమే పెరిగిందని, మిగిలిన మందుల ధరల్లో పెద్దగా మార్పు లేదని సంస్థలు చెబుతున్నాయి. అయితే ప్లాటినం ధర ఇంతగా పెరిగినందున, విక్రయ ధర పెంచితేనే ఈ మందులను ఉత్పత్తి చేయగలమని లేకపోతే ఉత్పత్తి నిలుపుదల చేయాల్సి వస్తుందని స్థానిక ఫార్మా పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

అదే జరిగితే క్యాన్సర్ మందులకు కొరత ఏర్పడి, రోగులకు మరింత నష్టం ఏర్పడుతుంది. ప్రస్తుత పరిస్థితులను, పరిశ్రమ విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు పేర్కొంటున్నారు. కొంతకాలం చూసి, ప్లాటినం ధర దిగిరాని పక్షంలో మందుల ధర పెంచడానికి ఎన్‌పీపీఏ అనుమతి ఇస్తుందని వివరిస్తున్నారు. అంటే కీమోథెరపీ చికిత్స చేయించుకునే క్యాన్సర్ బాధితుల మందుల ఖర్చు పెరిగే అవకాశం ఉంది.

# డిజిటల్ చెల్లింపుల రారాజు.. 'యూపీఐ'

### –గత నెలలో లావాదేవీల విలువ రూ.30 లక్షల కోట్లకు..

### –అంతర్జాతీయ రియల్-టైమ్ చెల్లింపుల్లో 49% వాటా

రైతుబజారుకు వెళ్లి కూరగాయలు కొన్నా, కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకున్నా.. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)తో చెల్లింపులు చేయడం మనదేశంలో సర్వసాధారణంగా మారింది. చిన్న బడ్డీ కొట్టు నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ వరకు చెల్లింపుల్లో యూపీఐ హవా కొనసాగుతోంది. ప్రజలకు చిల్లర సమస్య తీరిపోయింది. నగదు కోసం ఏటీఎంల వద్ద వరుసల్లో నిలబడటం కనుమరుగైంది. 2016 ఏప్రిల్ 11న యూపీఐ సేవలను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. గత నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ.30 లక్షల కోట్లకు చేరింది. గత పదేళ్లలో, ప్రజల రోజువారీ జీవితంలో యూపీఐ చెల్లింపులు ఒక భాగంగా మారడాన్ని ఇది సూచిస్తోంది.

**మొబైల్ నంబరు.. యూపీఐ ఐడీ....** డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. వర్చువల్ పేమెంట్ అడ్రస్ (వీపీఏ) ద్వారా బ్యాంక్ ఖాతాలను లింక్ చేయడంతో, లావాదేవీలు చాలా సులభంగా మారాయి. ఎవరికైనా నగదు పంపాలన్నా, వారి బ్యాంక్ ఖాతా సంఖ్య, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ అవసరం లేకుండా పోయింది. ఒక వ్యక్తి మొబైల్ నంబరు/యూపీఐ ఐడీ ఉంటే, సురక్షిత ధ్రువీకరణ (సెక్యూర్ అథెంటికేషన్) వినియోగించి నగదు పంపొచ్చు లేదా స్వీకరించొచ్చు. రోజులో ఏ సమయంలో అయినా, రియల్ టైమ్‌లో ఆటంకాలు లేకుండా, నగదు పంపే వెసులుబాటు ఉండటంతో ఎక్కువ మంది యూపీఐ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. నగదుపై ఆధారపడటాన్ని యూపీఐ తగ్గించింది. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, అసంఘటిత కార్మికులు, గ్రామీణ వినియోగదార్లు కూడా డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి అడుగుపెట్టేందుకు ఇదే కారణం. మన దేశంలో 2021లో 216 బ్యాంకులు యూపీఐ సదుపాయం కల్పిస్తుండగా, 2026 జనవరికి వీటి సంఖ్య 691కి చేరింది.

**8 దేశాల్లో:** సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, భూటాన్, నేపాల్, మారిషస్, శ్రీలంక, ఖతార్, ఇజ్రాయెల్ దేశాల్లోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి.

**రిటెయిల్ డిజిటల్ లావాదేవీల్లో 81%....** లావాదేవీల సంఖ్య, ప్రాసెసింగ్ పరంగా రియల్ టైమ్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే యూపీఐ అగ్ర స్థానంలో ఉంది. మన దేశంలో రిటెయిల్ డిజిటల్ లావాదేవీల్లో యూపీఐ వాటా 81%. అంతర్జాతీయంగా రియల్‌టైమ్ చెల్లింపుల లావాదేవీల్లో 49% వాటా యూపీఐదే. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) కూడా, ప్రపంచ రియల్‌టైమ్ చెల్లింపుల వ్యవస్థల్లో పరిమాణ పరంగా యూపీఐ అగ్రస్థానంలో ఉందని గుర్తించింది.

**యూపీఐ లైట్.. ఆటోపే.. క్రెడిట్ ఆన్ యూపీఐ....** చిన్న మొత్తాల చెల్లింపుల కోసం యూపీఐ లైట్ వంటి ఫీచర్లనూ ఆవిష్కరించారు. క్రమం తప్పకుండా చెల్లించాల్సిన లావాదేవీల కోసం యూపీఐ ఆటోపే, ప్రీఅప్రూవ్డ్ క్రెడిట్ కోసం క్రెడిట్ ఆన్ యూపీఐ వంటి సదుపాయాలూ ఉన్నాయి. యూపీఐకి బలమైన సెక్యూరిటీ ఆర్కిటెక్చర్ ఉంది. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం కూడా ఉంది. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి 2026 ఏప్రిల్ 1 నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ చెల్లింపుల కోసం 2ఫ్యాక్టర్ అథెంటికేషన్ తప్పనిసరి చేసింది. మోసాలను తగ్గించి, డిజిటల్ లావాదేవీలపై నమ్మకాన్ని పెంపొందించేందుకు పిన్, బయోమెట్రిక్స్, ఓటీపీలతో పాటు సెక్యూర్ టోకెన్స్ వంటి లేయర్లు ఇందులో ఉన్నాయి.




**--యూపీఐ పదేళ్ల ప్రస్థానంలో కీలక ఘట్టాలు....**

**2016 ఏప్రిల్ 11:** ప్రయోగాత్మకంగా యూపీఐ ప్రారంభం
**2016 ఆగస్టు:** ఫోన్‌పే యూపీఐ సేవలు ప్రారంభం
**2016 ఆగస్టు:** పేటీఎం యూపీఐ సేవలు ప్రారంభం
**2016 నవంబరు:** పెద్ద నోట్ల రద్దు.. డిజిటల్ చెల్లింపులకు మారాలని ప్రజలకు ప్రభుత్వ సూచన
**2016 డిసెంబరు:** ఎన్‌పీసీఐ యూపీఐ యాప్ భీమ్ ప్రారంభం
**2017 సెప్టెంబరు:** తేజ్ (ప్రస్తుత గూగుల్ పే) ప్రారంభం
**2018 ఆగస్టు:** యూపీఐ 2.0 ప్రారంభం
**2018 డిసెంబరు:** నెలవారీ లావాదేవీల విలువ రూ.లక్ష కోట్లు
**2020 జనవరి:** యూపీఐ లావాదేవీలపై సున్నా ఎండీఆర్
**2020 అక్టోబరు:** యూపీఐ లావాదేవీల సంఖ్య 100 కోట్లు
**2021 జూన్:** నెలవారీ లావాదేవీల విలువ రూ.5 లక్షల కోట్లు
**2022 మార్చి:** నెలవారీ లావాదేవీల పరిమాణం 500 కోట్లు
**2022 మే:** నెలవారీ లావాదేవీల విలువ రూ.10 లక్షల కోట్లు
**2022 సెప్టెంబరు:** యూపీఐకి రూపే క్రెడిట్ కార్డ్ అనుసంధానం, యూపీఐ లైట్ ప్రారంభం
**2023 ఫిబ్రవరి:** యూపీఐ ఇంటర్నేషనల్ ప్రారంభం (సింగపూర్‌లో..)
**2023 ఆగస్టు:** నెలవారీ లావాదేవీల సంఖ్య 1,000 కోట్లు
**2023 సెప్టెంబరు:** యూపీఐ ద్వారా ఏటీఎం నగదు ఉపసంహరణ
**2024 మే:** నెలవారీ లావాదేవీల విలువ రూ.20 లక్షల కోట్లు
**2025 ఆగస్టు:** నెలవారీ లావాదేవీల సంఖ్య 2,000 కోట్లు
**2026 మార్చి:** నెలవారీ లావాదేవీల విలువ రూ.30 లక్షల కోట్లు

# ఈ ఏడాది 25 వేల మంది ఫ్రెషర్లకు అవకాశం: TCS వెల్లడి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (202627) 25 వేలమంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ వెల్లడించింది. డిమాండ్‌ను బట్టి మరింత మందిని నియమించుకుంటామని తెలిపింది. 20252026 ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్ 44 వేల మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు సెక్టార్‌లో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఈ మేరకు టీసీఎస్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు మాట్లాడారు.ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ తన విధానంలో ఏమైనా మార్పులు చేసిందా? అని ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి ట్రైనింగ్ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా అందుబాటులోకి రావడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. అదే ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాలను బట్టి నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని కృతివాసన్ పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40 వేలు, అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు.




**--లేఆఫ్‌లపై..**

202526 ఆర్థిక సంవత్సరంలో 12 వేల మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించిన సంగతి తెలిసిందే. మరో రౌండ్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందా? అని ప్రశ్నించగా.. కంపెనీలో మెరుగైన పనితీరు కనబరిచినంత వరకు కెరీర్‌కు ఇబ్బంది లేదని పేర్కొన్నారు. గతేడాది కోతలకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణమన్న వాదనలను ఈ సందర్భంగా తోసిపుచ్చారు. తొలగించిన ఉద్యోగులు చాలా మంది సీనియర్ లెవల్‌కు చెందిన వారని తెలిపారు.

# డీజిల్‌పై ఎగుమతి సుంకం పెంపు

**ఎగుమతి సుంకం లేదా అదాటు పన్నును డీజిల్‌పై లీటరుకు రూ.55.5కు, విమాన ఇంధనం(ఏటీఎఫ్)పై లీటరుకు రూ.42కు కేంద్రం పెంచింది. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. మార్చి 26న డీజిల్‌పై లీటరుకు రూ.21.50, ఏటీఎఫ్‌పై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకాన్ని ప్రభుత్వం విధించగా, తాజాగా ఆ మొత్తాన్ని పెంచింది. పెట్రోలుపై ఎగుమతి సుంకం సున్నాగా కొనసాగనుంది.**

# 'బైకర్' విషయంలో మాట తప్పలేదు...శర్వానంద్



'తెలుగు సినిమా గర్వపడేలా 'బైకర్' ఉంటుందని నేను మొదటి నుంచి చెప్తూనే ఉన్నా. ఆ మాట తప్పలేదు. చెప్పినట్లుగానే మంచి కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాం'' అన్నారు కథానాయకుడు శర్వానంద్. ఆయన.. మాళవిక నాయర్ జంటగా నటించిన ఈ సినిమాని అభిలాష్ రెడ్డి తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో థాంక్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. ''నేను మంచి ఫ్యామిలీ సినిమాలే చేస్తాననే నమ్మకాన్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కోల్పోలేదు. 'బైకర్'తోనూ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నా. ఇది మంచి మౌత్ టాక్‌తో వెళ్తోంది. దర్శకుడు అభిలాష్ మంచి తండ్రీకొడుకుల కథ చెప్పాడు. రాజశేఖర్ మాకెప్పుడూ హీరోనే. ఆయన ఈ చిత్రం చేసినందుకు ఆనందంగా ఉంది'' అన్నారు. ''ఇది చాలా లాంగ్ రన్ ఉండే సినిమా. ఈ వేసవి అంతా మా 'బైకర్'దే. దీంట్లోని రేసింగ్‌తో పాటు భావోద్వేగాలకు అందరూ కనెక్ట్ అవుతున్నారు'' అన్నారు దర్శకుడు అభిలాష్ రెడ్డి. నటుడు రాజశేఖర్ మాట్లాడుతూ.. ''శర్వా హీరోగా చేసిన ఈ చిత్రంలో నేనింత మంచి పాత్ర చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్ర విజయానికి కారణం దర్శకుడు అభిలాష్‌రెడ్డి'' అన్నారు. ఈ కార్యక్రమంలో మాళవిక, నిరూప్ తదితరులు పాల్గొన్నారు.


# వాటికి ఈటీవీ విన్ సినిమాలు దృశ్యరూపం ఇచ్చినట్లున్నాయి...హరీశ్ శంకర్



''ఈటీవీ విన్ నుంచి ఓ సినిమా వస్తుందంటే అది చాలా బాగుంటుందని నమ్మకం. 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి'.. ఇలా వరుసగా చిన్న సినిమాలు చేస్తూ విజయాలందుకుంటున్నారు. ఇప్పుడీ 'పాపం ప్రతాప్'తోనూ ఆ విజయ పరంపర కొనసాగుతుంది'' అన్నారు హీరో అల్లరి నరేశ్. తిరువీర్ హీరోగా నటించిన ఈ సినిమాని ఎస్పీ దుర్గా నరేశ్ తెరకెక్కించారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్‌లో రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 17న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. హీరో అల్లరి నరేశ్, దర్శకుడు హరీశ్ శంకర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీశ్ మాట్లాడుతూ.. ''ఈనాడు సంస్థ ప్రతి కుటుంబంలో భాగం. చిన్నప్పుడు విపుల, చతుర పత్రికలు చదివేవాణ్ని. ఇప్పుడు ఈటీవీ విన్ సినిమాలు చూస్తుంటే వాటికి ఓ దృశ్యరూపం ఇచ్చినట్లుగా అనిపిస్తోంది. యావత్ చిత్ర పరిశ్రమ ఆశ్చర్యపోయే విధంగా బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకుంటున్నారు. ఈటీవీ విన్‌కి హ్యాట్సాఫ్. నాకు ఈ చిత్ర ట్రైలర్‌లో తిరువీర్ కంటే ప్రతాప్ పాత్రే ఎక్కువ కనిపించింది. ఈ సినిమాలో వినోదం పుష్కలంగా ఉందని నమ్ముతున్నా. అది జనాల్ని థియేటర్లకు రప్పిస్తుందని ఆశిస్తున్నా. ఈ చిత్ర టికెట్ రూ.100లోపే ఉంది. కచ్చితంగా అంతా థియేటర్లలోనే సినిమా చూడండి'' అన్నారు. ''ప్రస్తుతం కామెడీ సినిమాలు తగ్గుతున్నాయి. ఈ చిత్రం గురించి మాట్లాడుతున్నప్పుడు మా నాన్న పేరు ప్రస్తావించారు.

చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఇలాంటి కామెడీ ఎంటర్‌టైనర్స్ మరిన్ని రావాలని కోరుకుంటున్నా'' అన్నారు హీరో అల్లరి నరేశ్. తిరువీర్ మాట్లాడుతూ.. ''ఇది ఈవీవీ సత్యనారాయణ సినిమాలా ఉంటుంది. 'మగాడు అంటే ఏడవకూడదు' అంటారు. కానీ, తనూ మనిషే. ఆ భావాన్ని ఈ చిత్రంలో గొప్పగా చూపించారు. క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది'' అన్నారు. ''బయటకి చెప్పుకోలేక లోపలే బాధపడుతున్న ప్రతి మగాడికి ఈ సినిమా ఓ చిరునామాగా నిలుస్తుంది'' అన్నారు దర్శకుడు దుర్గా నరేశ్. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ.. ''కుటుంబ సమేతంగా చూడదగ్గ వినోదాత్మక చిత్రమిది. టికెట్ ధర రూ.99. తప్పకుండా థియేటర్లలో సినిమా చూడండి'' అన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ్, బీవీఎస్ రవి, నితిన్ చక్రవర్తి, సాయిలు కాంపాటి, రాకేశ్, అజయ్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

# నీ నవ్వులు సోకి మబ్బులు మెరుపులయ్యేనే...



నీ వేళ్లే పట్టి అందం నడక నేర్చేనే... నీ శ్వాసే చుట్టి గాలికి ఊపిరొచ్చేనే...' అంటూ ఆ అమ్మాయి సౌందర్యాన్ని తెగ వర్ణించేశాడు 'కొరియన్ కనకరాజు'. తనకి అంతగా నచ్చిన ఆ అమ్మాయి ఎవరు? ఆ ఇద్దరి ప్రేమ ప్రయాణం వెనక సంగతులేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. వరుణ్‌తేజ్, రితికా నాయక్ జంటగా నటిస్తున్న చిత్రమే 'కొరియన్ కనకరాజు'. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. యు.వి.క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలోని 'కమ్సాహంనిదా...' అంటూ సాగే పాటని శనివారం విడుదల చేశారు. 'నీ నవ్వులు సోకి మబ్బులు మెరుపులయ్యేనే... నీ కాళ్లే తాకి సంద్రం తియ్యగయ్యేనే...' అంటూ మొదలయ్యే ఈ పాటని కాసర్ల శ్యామ్ రచించగా, సిద్ శ్రీరామ్ ఆలపించారు. తమన్ స్వరపరిచారు. కొరియన్ భాషని స్పృశిస్తూ సాగే ఈ పాటలో వరుణ్‌తేజ్, రితికా జోడీ హుషారుగా కనిపించింది. ''విభిన్నమైన హారర్ కామెడీ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న చిత్రమిది. చిత్రీకరణ దాదాపుగా చివరి దశకు చేరుకుంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామ''ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: మనోజ్‌రెడ్డి కాటసాని.

# దేని కోసం హరుడి పోరాటం?

''నన్నొక యాక్షన్ హీరోలా ఆవిష్కరించిన చిత్రమిది. నటనతోపాటు నిర్మాతగా కూడా బాధ్యతల్ని తీసుకోవల్సి వచ్చింది'' అన్నారు వెంకట్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరుడు'. హెబ్బా పటేల్ కీలక పాత్ర పోషించారు. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహించారు. వి.ఆర్.ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించింది. వేసవి సందర్భంగా మే 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. కథానాయకుడు వెంకట్ మాట్లాడుతూ ''వేసవిలో అందరికీ వినోదం పంచే ఓ మంచి చిత్రం అవుతుంది. మా హరుడు దేని కోసం పోరాటం చేశాడన్నది తెరపైనే చూడాలి'' అన్నారు. ఈ కార్యక్రమంలో అలీ, లత, ఆనంద్, మణిజిన్నా, చంద్రమహేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ గాయని ఆశా భోంస్లే ఇకలేరు



ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) ఇకలేరు. ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమె కుమారుడు ఆనంద్ భోంస్లే ఈ విషయాన్ని ధ్రువీకరించారు. తన తల్లి అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబయిలోని శివాజీ పార్క్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ సోకడంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడగా ఆశా భోంస్లేను కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఆస్పత్రిలో చేర్చారు. మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కారణంగా మరణించినట్లు ఆమెకు చికిత్స అందించిన వైద్యుల్లో ఒకరైన డాక్టర్ ప్రతీప్ సందానీ మీడియాకు తెలిపారు. ఆశా భోంస్లే మృతి పట్ల సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సోషల్ మీడియాలో సంతాపం ప్రకటిస్తున్నారు. 1933లో మహారాష్ట్రలోని సాంగ్లీలో ఆశా భోంస్లే జన్మించారు. గాయనిగా సుదీర్ఘ ప్రయాణం ఆమెది. ఎన్నో వేల పాటలతో శ్రోతలను అలరించారు. చిత్ర పరిశ్రమకు చేసిన ఎనలేని కృషికిగానూ పద్మ విభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే, మహారాష్ట్ర భూషణ్, బంగా బిభూషన్ అవార్డులు ఆమెను వరించాయి.ఆశా సినీ ప్రస్థానం 1943లో మరాఠీ చిత్రం 'మజాబ్'తో ప్రారంభమైంది. అందులో 'చలా చలా నవ్ చలా' పాట పాడారు. 1948లో బాలీవుడ్ దర్శకుడు హంసరాజ్ బహల్ పిలుపుతో ముంబయి వెళ్లారు. 1954లో వచ్చిన 'బూట్ పాలిష్'లోని పాటలతో ఆశాకు మంచి గుర్తింపు దక్కింది. 'దమ్ మారో దమ్', 'చురా లియా హై తుమ్నే జో దిల్ కో' తదితర పాటలు సంచలనం సృష్టించాయి.తెలుగు సినిమాల్లో ఆశా భోంస్లే పాడింది తక్కువ పాటలే అయినా దేనికదే ప్రత్యేకం. 80ల నుంచి 2007 వరకూ తెలుగులో పాడారు. 'ఇది మౌనగీతం' (పాలు నీళ్లు), 'సీతాకాలం ప్రేమకు' (అశ్వమేధం), 'ఐసాలకిడీ' (పవిత్ర బంధం), నాలో ఊహలకు (చందమామ) తదితర పాటలతో ఆమె అలరించారు.తన సోదరి, ప్రముఖ గాయని లతా మంగేష్కర్ వ్యక్తిగత కార్యదర్శి గణపతిరావును పెళ్లి చేసుకున్నారు. కొన్నాళ్లకు విడాకులు తీసుకున్నారు. 1980లో ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్డీ బర్మన్‌ను వివాహమాడారు.1994లో ఆయన మరణించడంతో.. అప్పటి నుంచి తన ముగ్గురు పిల్లలు, మనవడు, మనవరాలే లోకంగా జీవితం గడిపారు.

## ఏ కష్టానికి కుంగిపోని 'ఆశ'



తీరాన్ని అలలు తాకినట్లు ఆమె జీవితాన్ని కష్టాలు వెన్నంటాయి.. టీనేజ్‌లోనే ప్రేమ వివాహం.. గర్భిణిగా ఉన్న సమయంలో భర్త దూరం కావడంతో.. ఒక దశలో ఆత్మహత్యకు యత్నించినా.. ఆమె గానామృతాన్ని ఆస్వాదించే అదృష్టం ప్రపంచానికి ఉండటంతో మృత్యువును తప్పించుకొన్నారు. 'దమ్ మారో దమ్' అంటూ పాడి సంగీతాభిమానులను ఓలలాడించారు. 14 భాషల్లో వేలాది పాటలతో భారత చిత్రపరిశ్రమను అలరించారు. ఆమే ఆశా భోంస్లే..!

**చిన్నపటి నుంచే..** ఆశా మహారాష్ట్రలోని సాంగ్లీలో కళాకారుల కుటుంబంలో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు. ఆమె తండ్రి దీననాథ్ మంగేష్కర్ థియేటర్ ఆర్టిస్ట్. అక్క లతా మంగేష్కర్. ఉమా, మీనా అక్కాచెల్లెళ్లు, హృదయనాథ్ సోదరుడు. ఆశా 9 ఏళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయింది. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు అక్క లతా మంగేష్కర్‌తో కలిసి పాటలు పాడింది. క్లాసికల్, గజల్స్, రొమాంటిక్ ఇలా అన్ని రకాల పాటలను అలవోకగా పాడగలగడం ఆమెకు దేవుడిచ్చిన వరం. 16 ఏళ్ల వయసులో ఆమె తన అక్క లతా మంగేష్కర్ పీఏ 31 ఏళ్ల గణపత్‌రావ్ భోంస్లేను ప్రేమ వివాహం చేసుకొన్నారు. దీనిని లతా తీవ్రంగా వ్యతిరేకించారు. అక్కాచెల్లెళ్ల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కానీ, ఆశాకు తొలి బిడ్డ పుట్టాక పుట్టింటి వారు ఆమె వివాహాన్ని ఆమోదించారు. కానీ, గణపత్‌కు మాత్రం ఆశా పుట్టింటి వారితో.. ముఖ్యంగా లతా మంగేష్కర్‌తో సంబంధాలు నెరపడం ఏమాత్రం ఇష్టం లేదు. దీంతో ఆశాను డబ్బు కోసం వేధించడం మొదలుపెట్టారు. మరోవైపు గణపత్‌రావ్ కుటుంబం గాయనిని ఇంటి కోడలుగా ఆమోదించలేదు. తన చిన్నకుమారుడు ఆనంద్‌ను కనబోయే ముందు అత్తగారి కుటుంబీకులు ఆశాను ఇంటి నుంచి వెళ్లిపొమ్మని చెప్పారు. మరోవైపు భర్త హింసాత్మక ప్రవృత్తితో ఆశా చాలా ఇబ్బందులు పడ్డారు.

**నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నం....** మూడో బిడ్డకు జన్మనివ్వడానికి ముందు.. ఆశాను ఆమె అత్తగారు ఇంటి నుంచి గెంటివేశారు. అనారోగ్యంతో ఆస్పత్రిపాలయ్యారు. దీంతో ఇక తన జీవితం ముగిసిపోయిందన్న ఆవేదనతో ఒక బాటిల్ నిద్రమాత్రలను మింగేశారు. 'కడుపులో పెరుగుతున్న బిడ్డపై బలమైన మమకారమే నన్ను మృత్యు ముఖం నుంచి వెనక్కి తెచ్చింది' అని ఆమే స్వయంగా ఓ సందర్భంలో వెల్లడించారు. 1960లో ఆమె భర్త నుంచి విడిపోయారు.

**జీవితంలోకి ఆర్.డి. బర్మన్ రాక..** 1980లో మ్యూజిక్ డైరెక్టర్ ఆర్.డి.బర్మన్‌ను ద్వితీయ వివాహం చేసుకొన్నారు. వీరిద్దరి మధ్య తొలిసారి 1966లో తీస్రీ మంజిల్ చిత్రానికి ఓ పాట రికార్డింగ్ సమయంలో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత నుంచి ఆర్.డి.బర్మన్ స్వరపర్చిన పలు పాటలు పాడింది. వారి స్నేహం ప్రేమగా మారింది. ఒక రోజు పెళ్లి చేసుకొందామని ఆమెకు బర్మన్ ప్రపోజ్ చేశారు. ఆశా కూడా అంగీకరించింది. కానీ, బర్మన్ తల్లికి మాత్రం ఈ పెళ్లి ఏమాత్రం ఇష్టంలేదు. దీంతో ఆయన కొన్నాళ్లు తల్లి మాటను మన్నించారు. కానీ, తండ్రి ఎస్.డి.బర్మన్ మరణం, తల్లి మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినడంతో.. 1980లో ఆశాను వివాహం చేసుకొన్నారు. 1994లో ఆయన చనిపోవడంతో.. అప్పట్నుంచి తన పిల్లలు, మనవడుమనవరాలే లోకంగా గడుపుతున్నారామె.

**గాయనిగా తొలినాళ్లలో తిరస్కారాలు..** లతా మంగేష్కర్ సోదరిగా ఆమెకు గుర్తింపు ఉన్నా.. గాయనిగా ఆమె ప్రస్థానం కూడా అంత తేలికకాదు. 1947లో ఓ ప్రముఖ స్టూడియోలో 'జాన్ పెహచాన్' చిత్రం కోసం పాట పాడేందుకు వెళ్లారు. ఆమెతోపాటు కిశోర్‌కుమార్ కూడా ఉన్నారు. వీరిని అర్ధరాత్రి వరకు కూర్చోబెట్టి.. అవకాశం ఇవ్వకుండా తిరస్కరించి పంపించారు. ఈ విషయాన్ని ఆశానే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కానీ, నేడు ఆమె 12,000కుపై పాటలతో భారతీయ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్రవేశారు.

**ఆశా చేతి వంట అద్భుతం..!** ఆశా భోంస్లే స్వరంలోనే కాదు.. చేతిలోనూ మ్యాజిక్ ఉంది. ఆమె చేతి వంట అద్భుతంగా ఉంటుందని బాలీవుడ్‌లో టాక్. ఆశా చేత్తో చేసిన షమి కబాబ్, కడాయ్ ఘోస్ట్, కాలీ దాల్ వంటివి రిషి కపూర్‌కు చాలా ఇష్టం. ఒక వేళ తాను గాయని కాకపోతే.. కుక్ అయ్యే దానినని ఆమె ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఆమె రెస్టారెంట్ వ్యాపారం కూడా నిర్వహించారు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితమే దుబాయ్‌లో Ashajs అనే రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత కువైట్, అబుదాబీ, దోహా, బహ్రెయిన్‌ల్లో విస్తరించారు. వీటిని వాఫీ గ్రూప్ నిర్వహిస్తుండగా.. వీటిల్లో ఆమెకు కొంత వాటా ఉంది. ఇక్కడి చెఫ్‌లకు ఆమె స్వయంగా ఆరు నెలలు శిక్షణ కూడా ఇచ్చారు. 90 ఏళ్లు నిండినా.. తన పిల్లలు, మనవళ్ళు, మనవరాళ్లకు వండిపెట్టేవారు.

## ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు..
## ఆశా భోంస్లేకు ప్రముఖుల సంతాపం

ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) ఆదివారం కన్నుమూశారు. ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. 'ఆశా భోంస్లే మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. దశాబ్దాల పాటు సాగిన ఆమె సంగీత ప్రస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఆమె కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఆశా భోంస్లే జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆమె పాటలు ప్రజల జీవితాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయి'

**ప్రధాని నరేంద్ర మోదీ....**
'ఆశా భోంస్లే మరణ వార్త విని బాధపడ్డా. ఆమె ఓ దిగ్గజ గాయని. అత్యధిక పాటలు పాడి చరిత్ర సృష్టించారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు మ్యూజిక్ ఇండస్ట్రీకి సేవలందించారు. భారతీయ సంగీత జగత్తులో ఆమె పాటలు తరతరాలపాటు ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఆశా కుటుంబానికి, ఆమె అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా''

**ఏపీ సీఎం చంద్రబాబు....**
''ప్రముఖ గాయని, జాతీయ పురస్కార గ్రహీత, పద్మ విభూషణ్ ఆశా భోంస్లే లేరన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలు, దశాబ్దాల పాటు పలు భాషల్లో ప్రదర్శించిన అపూర్వ ప్రతిభ చిరస్మరణీయం. ఆమె మరణం దేశంలోని సాంస్కృతిక, కళారంగాలకు తీరని లోటు. ఆశా కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా''

**తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి....**
''ఆశా భోంస్లే గాత్రం తరతరాల పాటు అనేక రకాల భావోద్వేగాలను పలికిస్తూ, భారతీయ సినిమాకు ప్రత్యేకంగా నిలిచింది. ప్రతి పాటకూ గ్రేస్ తీసుకువచ్చిన ఆమెను ఎప్పుడూ ఆరాధిస్తా. భారతీయ చిత్ర పరిశ్రమ భర్తీ చేయలేని ఓ స్వరాన్ని కోల్పోయింది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా''

**మెగాస్టార్ చిరంజీవి....**
'ఆశా భోంస్లే మరణవార్త విని తీవ్రంగా దుఃఖిస్తున్నా. ఆమె స్వరం దశాబ్దాల పాటు భారతీయ సినిమాకు ప్రాణంగా నిలిచి, లక్షలాది హృదయాలను తాకింది. తరతరాలు నిలిచిపోయే జ్ఞాపకాలను వదిలివెళ్లారు. ప్రేమ, గౌరవంతో ఆమెను ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉంటాం. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి'

**ఎన్టీఆర్.....**
''గొప్ప గాయని ఆశా భోంస్లే మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. తరతరాలుగా తన పాటతో ఎంతోమంది హృదయాలను మంత్రముగ్ధులను చేసిన గాయని. ఎన్నో బెంగాలీ పాటలను కూడా ఆమె పాడారు. 2018లో రాష్ట్ర అత్యున్నత పౌర పురస్కారం 'బంగ బిభూషణ్'ను ఆమెకు ప్రదానం చేశాం. ఆమె కుటుంబం, అభిమానులు, మొత్తం సంగీత పరిశ్రమకు సానుభూతి వ్యక్తం చేస్తున్నా''

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్...**
''ఆశా భోంస్లే గొంతు మూగబోవడం సంగీత ప్రపంచానికి తీరని లోటు. భారతీయ భాషల్లో ఏళ్ల పాటు తన సుమధుర స్వరంతో వీనుల విందైన పాటలు అందించిన లెజెండరీ సింగర్. ఆశాజీ భౌతికంగా మనకు దూరమైనా.. పాట రూపంలో జీవించే ఉంటారు. మహా గాయని మృతి పట్ల నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా''

**ఏపీ మంత్రి నారా లోకేశ్....**
''ఆశా భోంస్లే మరణం కలచివేసింది. ఆమె స్వరం ఎప్పటికీ నిలిచే ఉంటుంది. ఆశా కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా''

**అల్లు అర్జున్......**
''ఆశాజీ మరణం నన్ను బాధించింది. నిశ్శబ్దంగా వీడ్కోలు పలికినా.. ఆమె పాటలు మనతో ఎప్పటికీ ఉండిపోతాయి''

**నారా రోహిత్....**
కమల్‌హాసన్, సంజయ్‌దత్, సన్నీదేవోల్, మనోజ్ బాజ్‌పాయ్, ఏఆర్ రెహమాన్, తమన్, శంకర్ మహదేవ్ తదితరులు ఆశా భోంస్లే మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్, జియో స్టూడియోస్, వైజయంతీ మూవీస్ తదితర నిర్మాణ సంస్థలూ సంతాపం తెలిపాయి.

# సమర్పణ.. చరణ్ రచన... రామ్

ప్రేక్షకులకు కొత్తదనం పంచిచ్చేందుకు సినీతారలంతా కొత్త దారులు వెతుక్కుంటున్నారు. రచన, దర్శకత్వం, నిర్మాణం.. ఇలా తమలోని కొత్త కోణాల్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. బహుముఖ ప్రజ్ఞతో సినీప్రియుల్ని మెప్పించేందుకు శ్రమిస్తున్నారు. మరి త్వరలో కొత్త అవతారాల్లో తెరపై అలరించనున్న ఆ తారలెవరు? ఆ చిత్ర విశేషాలేంటి?

రామ్‌చరణ్ నటనకే పరిమితం కాకుండా నిర్మాతగానూ ఇప్పటికే ప్రేక్షకుల్ని మెప్పించారు. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీని ప్రారంభించి.. తన తండ్రితో 'ఖైదీ నెం.150', 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్‌ఫాదర్' లాంటి విజయవంతమైన చిత్రాల్ని నిర్మించారు. అయితే ఇప్పుడాయన తొలిసారి ఓ బయటి హీరో సినిమా కోసం సమర్పకుడిగా మారారు. ప్రస్తుతం నిఖిల్ హీరోగా రామ్ వంశీ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'ది ఇండియా హౌస్'. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకి చరణ్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన వాస్తవ సంఘటనలతో పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా దీన్ని తెరకెక్కిస్తున్నారు.



చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో తెరపైకి రానుంది.

# రా రా ధీవర..




నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా వచ్చే నెల తెరపైకి రానున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే చిత్ర బృందం ప్రచార పర్వాన్ని వేగవంతం చేస్తోంది. దీనిలో భాగంగానే ఈ నెల 16న "రా రా ధీవర" అనే పాటని విడుదల చేయనున్నట్లు శనివారం ప్రకటించారు. ఈ మేరకు నిఖిల్ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అందులో తను యోధుడిలా శత్రువులపైకి ఈటెను విసిరేందుకు సిద్ధమైనట్లు కనిపించారు. ఇది చారిత్రక అంశాలతో ముడిపడిన యాక్షన్ డ్రామాగా ముస్తాబైంది. దీని కోసం ఆవిష్కరించిన ప్రపంచం, ఆ విజువల్స్ అన్నీ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచేలా ఉంటాయని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకి సంగీతం: రవి బస్రూర్, ఛాయాగ్రహణం: కె.కె.సెంథిల్ కుమార్.




## లెజెండరీ సింగర్ ఆశా భోస్లేకు IPL నివాళి

భారతీయ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. వేల సంఖ్యలో అద్భుతమైన పాటలతో దశాబ్దాలుగా సంగీత ప్రియులను అలరించిన లెజెండరీ గాయని, 'నైటింగేల్ ఆఫ్ ఇండియా' ఆశా భోస్లే (92) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, ఆదివారం ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఛాతీ ఇన్ఫెక్షన్, మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా తుదిశ్వాస విడిచారు. దాదాపు ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో ఆమె పాడిన పాటలు ప్రతి భారతీయుడి గుండెల్లో చెరగని ముద్ర వేశాయి. 'పియా తూ అబ్ తో ఆజా', 'దమ్ మారో దమ్', 'రంగీలా రే' వంటి ఎన్నో టైమ్‌లెస్ హిట్స్ ద్వారా ఆమె తన గాత్రంతో సంగీత ప్రపంచాన్ని ఏలారు. పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులతో ఆమె అందుకున్న గౌరవం ఆమె గొప్పతనానికి నిదర్శనం.

ఆశా భోస్లే మరణవార్త తెలుసుకున్న క్రీడా ప్రపంచం, ముఖ్యంగా క్రికెట్ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఆదివారం సాయంత్రం వాంఖడే స్టేడియంలో జరిగిన ముంబై ఇండియన్స్ (MI), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) మ్యాచ్ ప్రారంభానికి ముందు, ఆశా భోస్లేకు ఘన నివాళి అర్పించారు. స్టేడియంలోని ఆటగాళ్లు, ప్రేక్షకులు ఒక నిమిషం మౌనం పాటించి ఆమెకు ఘన నివాళులర్పించారు. MI, RCB ఆటగాళ్లు తమ గౌరవసూచకంగా బ్లాక్ ఆర్మ్‌బ్యాండ్స్ ధరించి మ్యాచ్ ఆడారు. స్టేడియంలో ఆమె పాడిన మధురమైన గీతాలు ప్లే చేసినపుడు, అక్కడ ఉన్న అభిమానులందరూ భావోద్వేగానికి లోనయ్యారు. విరాట్ కోహ్లీ, సచిన్ తెండూల్కర్ వంటి క్రికెట్ లెజెండ్స్ సోషల్ మీడియా వేదికగా ఆమెకు తమ హృదయపూర్వక నివాళులు అర్పించారు. టాటా ఐపీఎల్ "ఆమె గాత్రం తరతరాలుగా భారతీయ సంస్కృతిని సమృద్ధి చేసింది" అని కొనియాడింది. హిందీతో పాటు తెలుగు, బెంగాలీ, మరాఠీ వంటి అనేక భాషల్లో వేలాది పాటలను తన అద్భుతమైన గాత్రంతో పలికించిన ఆశా భోస్లే లేని లోటు భారతీయ సంగీత రంగానికి తీరని లోటు.

## నితీశ్.. మ్యాచ్‌లో లేకున్నా జరిమానా




చెన్నై: చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళిని ఉల్లఘించిన కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ నితీశ్ రాణాకు శిక్ష పడింది. అతడి మ్యాచ్ ఫీజులో రిఫరీ 25 శాతం జరిమానా విధించాడు. శనివారం రాత్రి జరిగిన ఈ మ్యాచ్‌కు నితీశ్ డీసీ తుది జట్టులో లేడు. కానీ మ్యాచ్ సందర్భంగా డగౌట్ దగ్గర అతను అంపైర్‌తో గొడవ పడ్డాడు. ఢిల్లీ 19వ ఓవర్లో చెమటతో తడిచిన గ్లవ్స్‌ను మార్చుకుంటానని బ్యాటర్ స్టబ్స్ కోరగా.. అంపైర్ నిరాకరించాడు. తర్వాతి బంతికే అతను ఔటైపోయాడు. గ్లవ్స్ మార్చుకోవడానికి స్టబ్స్‌కు అనుమతి ఇవ్వకపోవడంపై డగౌట్ వద్ద నాలుగో అంపైర్‌తో నితీశ్ వాగ్వాదానికి దిగాడు. "ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించినందుకు నితీశ్ రాణా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తున్నాం. అతడి ఖాతాలో ఒక అయోగ్యత పాయింట్ కూడా చేర్చాం" అని ఐపీఎల్ అధికారులు వెల్లడించారు. ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు 12 లక్షల జరిమానా పడింది. ఢిల్లీపై గెలవడం ద్వారా చెన్నై ఈ సీజన్లో తొలి విజయాన్ని నమోదు చేసింది.

## ఆర్సీబీ దంచేసింది

# ముంబయిపై విజయం

**డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ మళ్లీ గెలుపు బాట పట్టింది. వాంఖడేలో దూకుడైన ఆటతో ఐపీఎల్-19లో మూడో విజయాన్నందుకుంది. సాల్ట్, రజత్ పాటీదార్ విధ్వంసంతో కొండంత స్కోరు చేసిన బెంగళూరు.. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ముంబయికి కళ్లెం వేసింది. విజయంతో టోర్నీని ఆరంభించిన ముంబయికి ఇది వరుసగా మూడో ఓటమి.**

ముంబయి : రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సత్తా చాటింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 18 పరుగుల తేడాతో ముంబయి ఇండియన్స్‌ను మట్టికరిపించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫిల్ సాల్ట్ (78; 36 బంతుల్లో 6×4, 6×6), రజత్ పాటీదార్ (53; 20 బంతుల్లో 4×4, 5×6) రెచ్చిపోవడంతో మొదట బెంగళూరు 4 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (50; 38 బంతుల్లో 5×4, 1×6) అర్ధశతకం సాధించాడు. ఛేదనలో ముంబయి 5 వికెట్లకు 222 పరుగులే చేయగలిగింది. రూథర్‌ఫర్డ్ (71 నాటౌట్; 31 బంతుల్లో 1×4, 9×6) టాప్ స్కోరర్. హార్దిక్ (40; 22 బంతుల్లో 6×4, 1×6) రాణించాడు. నిజానికి ఓపెనర్ రికెల్టన్ (37; 22 బంతుల్లో 3×4, 3×6) మెరుపులతో ముంబయి ఛేదన ధాటిగానే మొదలైంది. డఫీ బౌలింగ్‌లో సిక్స్‌తో ఖాతా తెరిచిన అతడు.. ఆ తర్వాత జోరు కొనసాగించాడు. రోహిత్ కూడా ఓ సిక్స్ బాదాడు. అయితే ఆరో ఓవర్లో జట్టు స్కోరు 57 వద్ద రోహిత్ (19) తొడ కండరాల గాయం వల్ల రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాక ముంబయి ఇన్నింగ్స్ గతి తప్పింది. కాసేపటికే సుయాశ్.. ఒకే ఓవర్లో రికెల్టన్, తిలక్ వర్మ (1)లను ఔట్ చేసి ఆ జట్టు గట్టిదెబ్బ తీశాడు. సూర్యకుమార్ (33; 22 బంతుల్లో 5×4), హార్దిక్‌ల ప్రయత్నం ఏ మాత్రం సరిపోలేదు. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. ఈ ఇద్దరితో పాటు నమన్ ధీర్ (1)నూ కోల్పోయిన ముంబయి 16 ఓవర్లకు 157/5తో నిలిచింది. ఆ తర్వాత ఓటమి లాంఛనమే. ఆఖర్లో రూథర్‌ఫర్డ్ చెలరేగినా ఫలితం లేకపోయింది. అతడి దూకుడు ఓటమి అంతరాన్ని తగ్గించిందంతే.

### ఊచకోత..

టాప్ ఆర్డర్ మెరుపులతో అంతకుముందు బెంగళూరు భారీ స్కోరు సాధించింది. సాల్ట్, కోహ్లి, పాటీదార్ అర్ధశతకాలు చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి సాల్ట్, కోహ్లి జంట అదిరే ఆరంభాన్నిచ్చింది. తొలి ఓవర్లో బౌల్ట్ బౌలింగ్‌లో డీప్ స్క్వేర్ లెగ్‌లో కోహ్లి చక్కని సిక్స్ బాదినప్పటికీ.. తొలి వికెట్ భాగస్వామ్యంలో జోరు మాత్రం సాల్‌ట్‌దే. కోహ్లి ధాటిగా ఆడలేకపోయాడు. అయితే చకచకా బౌండరీలు బాదిన సాల్ట్.. అయిదో ఓవర్లో విరుచుకుపడ్డాడు. శాంట్నర్ బౌలింగ్‌లో వరుసగా 6, 6, 6, 4 దంచేశాడు. ఆ తర్వాత లెగ్ స్పిన్నర్ మయాంక్ మార్కండె వేసిన వేసిన ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్లో వరుసగా 4, 4, 4, 6తో చెలరేగిపోయాడు. ఈ క్రమంలో అతడు 25 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. 10 ఓవర్లు ముగిసే సరికి బెంగళూరు 115/0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. తర్వాతి ఓవర్లోనే సాల్‌ట్‌ను శార్దూల్ ఔట్ చేసినప్పటికీ ముంబయికి ఉపశమనం ఏమీ దక్కలేదు. మరోవైపు కోహ్లి నిలబడగా.. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ పాటీదార్ భీకర బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించాడు. మార్కండె ఓవర్లో మూడు సిక్స్‌లు బాదేసిన అతడు.. శార్దూల్ బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ కొట్టాడు. బౌల్‌ట్‌నూ వదల్లేదు. అయితే రెండో వికెట్‌కు 65 పరుగులు జోడించిన కోహ్లి, పాటీదార్ వరుస ఓవర్లలో నిష్క్రమించారు. 16 ఓవర్లకు 194/3తో నిలిచిన ఆర్సీబీ.. టిమ్ డేవిడ్ (34 నాటౌట్; 16 బంతుల్లో 2×4, 3×6) దంచి కొట్టడంతో ఆఖరి నాలుగు ఓవర్లలో 46 పరుగులు రాబట్టింది. జితేశ్ శర్మ (10)తో నాలుగో వికెట్‌కు డేవిడ్ 37 పరుగులు జోడించాడు. బౌల్ట్ నాలుగు ఓవర్లలో 50 పరుగులు సమర్పించుకున్నాడు. మార్కండె రెండు ఓవర్లలోనే 40 పరుగులిచ్చాడు. తన తొలి ఓవర్లో 22 పరుగులిచ్చిన శాంట్నర్.. తర్వాతి మూడు ఓవర్లలో మాత్రం కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. బుమ్రా (0/35) వికెట్ల వేటలో విఫలమయ్యాడు.

### స్కోరు వివరాలు


బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) హార్దిక్ (బి) శార్దూల్ 78; కోహ్లి (సి) సూర్యకుమార్ (బి) హార్దిక్ 50; రజత్ పాటీదార్ (సి) తిలక్ (బి) శాంట్నర్ 53; టిమ్ డేవిడ్ నాటౌట్ 34; జితేశ్ శర్మ ఎల్బీ (బి) బౌల్ట్ 10; షెఫర్డ్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 13 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 240; వికెట్ల పతనం: 1120, 2185, 3194, 4231; బౌలింగ్: బౌల్ట్ 40501; హార్దిక్ 40391; బుమ్రా 40350; శాంట్నర్ 40)431; మయాంక్ మార్కండె 20400; శార్దూల్ 20321

ముంబయి ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) భువనేశ్వర్ (బి) సుయాశ్ 37; రోహిత్ రిటైర్డ్‌హర్ట్ 19; సూర్యకుమార్ (సి) రసిక్ సలామ్ (బి) కృనాల్ 33; తిలక్ వర్మ (సి) డఫీ (బి) సుయాశ్ శర్మ 1; హార్దిక్ (సి) షెఫర్డ్ (బి) డఫీ 40; రూథర్‌ఫర్డ్ నాటౌట్ 71; నమన్ ధీర్ (సి) పాటీదార్ (బి) రసిక్ సలామ్ 1; శాంట్నర్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 12 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 222; వికెట్ల పతనం: 172, 274, 3121, 4145; 5154 బౌలింగ్: డఫీ 40581; భువనేశ్వర్ 40380; రసిక్ సలామ్ 2.50231; కృనాల్ పాండ్య 40261; సుయాశ్ శర్మ 40472; రొమారియో షెఫర్డ్ 1.10280




# గుజరాత్ అలవోకగా...

## రెండో విజయం



రెండు వరుస ఓటములతో టోర్నీని పేలవంగా మొదలుపెట్టిన గుజరాత్ మళ్లీ విజయాల బాట పట్టింది. నిలకడలేమితో ఇబ్బంది పడుతున్న లఖ్‌నవూపై సమష్టి ప్రదర్శనతో గెలిచింది. ప్రసిద్ధ్ కృష్ణ సూపర్ బౌలింగ్‌తో సూపర్‌జెయింట్స్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేసిన టైటాన్స్.. అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. గిల్, బట్లర్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అర్ధసెంచరీలు సాధించారు.

లఖ్‌నవూ : ఐపీఎల్ 19లో ఆదివారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో లఖ్‌నవూను గుజరాత్ 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రసిద్ధ్ కృష్ణ (4/28) విజృంభించడంతో సూపర్ జెయింట్స్ 8 వికెట్లకు 164 పరుగులే చేయగలిగింది. అశోక్ శర్మ (2/32) కూడా రాణించాడు. మార్‌క్రమ్ (30; 21 బంతుల్లో 5×4, 1×6) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. మిగతా బ్యాటర్లెవరూ కనీసం 20 కూడా దాటలేదు. బట్లర్ (60; 37 బంతుల్లో 11×4), గిల్ (56; 40 బంతుల్లో 6×4, 1×6) సత్తా చాటడంతో లక్ష్యాన్ని టైటాన్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. నాలుగు మ్యాచ్‌ల్లో గుజరాత్‌కిది రెండో విజయం కాగా.. అన్నే మ్యాచ్‌లు ఆడిన ఎల్ఎస్‌జీ రెండో ఓటమిని ఖాతాలో వేసుకుంది.

### ఆడుతూ పాడుతూ..

పెద్ద స్కోరు కాకపోయినా బ్యాటింగ్‌కు కాస్త కష్టంగా ఉన్న పిచ్‌పై గుజరాత్ ఓపెనర్లు గిల్, సాయి సుదర్శన్ (13) ఆరంభంలో ఆచితూచి ఆడారు. 4 ఓవర్లకు 25 పరుగులే చేశారు. కానీ షమి వేసిన అయిదో ఓవర్లో గిల్ మూడు ఫోర్లు, ఓ సిక్స్ కొట్టి స్కోరు బోర్డులో వేగం పెంచాడు. తర్వాతి ఓవర్లోనే సుదర్శన్‌ను ఔట్ చేసిన దిగ్వేశ్ లఖ్‌నవూకు బ్రేక్ ఇచ్చాడు. అయితే గిల్‌కు బట్లర్ తోడయ్యాక గుజరాత్ పని తేలికైపోయింది. ఇద్దరూ అలవోకగా షాట్లు ఆడుతూ ఇన్నింగ్స్‌ను నడిపించారు. 10 ఓవర్లకు టైటాన్స్ 86/1తో లక్ష్యం దిశగా సాగింది. అవేష్ వేసిన 12వ ఓవర్లో బట్లర్ హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. గిల్ సైతం వీలుచిక్కినపుడల్లా బంతిని బౌండరీ దాటించాడు. గిల్ 34 బంతుల్లో, బట్లర్ 29 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. వరుస ఓవర్లలో గిల్, బట్లర్ వెనుదిరిగినా.. గుజరాత్‌కు ఇబ్బంది లేకపోయింది. సుందర్ (21; 13 బంతుల్లో 2×4, 1×6), తెవాతియా (10) ఎలాంటి నాటకీయతకు చోటివ్వకుండా పని ముగించారు. జీటీ బౌలర్లలో షమి, ప్రిన్స్, దిగ్వేశ్ తలో వికెట్ తీశారు.

### లఖ్‌నవూ తడబాటు..



200 కూడా కాపాడుకోవడం కష్టమవుతున్న నేపథ్యంలో.. లఖ్‌నవూ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. ప్రసిద్ధ్ కృష్ణ గొప్పగా బౌలింగ్ చేయడం, మిగతా బౌలర్లూ కట్టుదిట్టంగా బంతులేయడంతో పంత్‌సేన పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించలేకపోయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు రెండో ఓవర్లోనే ఎదురుదెబ్బ తగిలింది. సిక్స్, ఫోర్ బాది ఊపుమీద కనిపించిన మార్ష్ (11)ను ఔట్ చేశాడు రబాడ. అయిదో ఓవర్లో సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మంచి లయలో కనిపించిన పంత్ (18)ను పెవిలియన్ చేర్చడమే కాక మూడు పరుగులే ఇచ్చాడు. అయితే వికెట్లు పడినా మార్‌క్రమ్ దూకుడుగా ఆడడంతో పవర్‌ప్లే ఆఖరికి సూపర్ జెయింట్స్ 60/2తో నిలిచింది. క్రీజులో నిలదొక్కుకున్న మార్‌క్రమ్‌ను, బదోని (9)ని తన వరుస ఓవర్లలో ప్రసిద్ధ్ ఔట్ చేయడంతో లఖ్‌నవూ ఇన్నింగ్స్ గాడి తప్పింది. 10 ఓవర్లలో 80/4తో నిలిచింది. ఆ తర్వాత స్కోరు బోర్డు వేగం మందగించింది. ఈ సీజన్‌లో ఏమాత్రం ప్రభావం చూపించలేకపోతున్న పూరన్ (19) రషీద్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాది లఖ్‌నవూ అభిమానుల్లో జోష్ తెచ్చాడు. అయితే తర్వాతి ఓవర్లోనే ప్రసిద్ధ్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. అబ్దుల్ సమద్ (18) కూడా నిలవలేకపోయాడు. 17 ఓవర్లకు 120/6తో నిలిచిన ఎల్ఎస్‌జీ కనీసం 150 పరుగులైనా చేస్తుందా అనిపించింది. గత మ్యాచ్ హీరో ముకుల్ చౌదరి (18) ఈసారి మెరిపించలేకపోయాడు. అయితే షమి (5 బంతుల్లో 12) ఒక ఫోర్, సిక్స్.. అరంగేట్ర ఆటగాడు జార్జ్ లిండ్ (16) మూడు ఫోర్లు బాదడంతో లఖ్‌నవూ 160 మార్కు అందుకుంది. రషీద్ ఖాన్ వికెట్ పడగొట్టకపోయినా నాలుగు ఓవర్లలో కేవలం 25 పరుగులే ఇచ్చాడు.

### స్కోరు వివరాలు

లఖ్‌నవూ ఇన్నింగ్స్ : మార్‌క్రమ్ (సి) సుందర్ (బి) ప్రసిద్ధ్ 30; మార్ష్ (సి) గిల్ (బి) రబాడ 11; పంత్ (సి) తెవాతియా (బి) సిరాజ్ 18; బదోని (సి) ఫిలిప్స్ (బి) ప్రసిద్ధ్ 9; పూరన్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 19; సమద్ (సి) ఫిలిప్స్ (బి) అశోక్ 18; ముకుల్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 18; లిండ్ (సి) షారుఖ్ (బి) అశోక్ 16; షమి నాటౌట్ 12; అవేష్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 164; వికెట్ల పతనం: 114, 245, 369, 474, 5109, 6118, 7131, 8157; బౌలింగ్: సిరాజ్ 40191; రబాడ 40541; అశోక్ 40322; ప్రసిద్ధ్ 40284; రషీద్ 40250

గుజరాత్ ఇన్నింగ్స్ : సుదర్శన్ (సి) అవేష్ (బి) దిగ్వేశ్ 15; గిల్ (సి) పంత్ (బి) ప్రిన్స్ 56; బట్లర్ (సి) మార్‌క్రమ్ (బి) షమి 60; సుందర్ నాటౌట్ 21; తెవాతియా నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం: (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 165; వికెట్ల పతనం: 145, 2129, 3135; బౌలింగ్: షమి 40361; ప్రిన్స్ 40311; దిగ్వేశ్ 40311; లిండ్ 30280; అవేష్ 20240; మార్‌క్రమ్ 1.40150




## ఆయుష్.. రన్నరప్‌తో సరి

### ఆసియా బ్యాడ్మింటన్ ఫైనల్లో ఓటమి

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి పోరాటానికి తెరపడింది. అద్వితీయమైన ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆయుష్.. ఫైనల్లో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఆయుష్ 821, 1021తో ప్రపంచ ఛాంపియన్ షి యుకి (చైనా) చేతిలో పరాజయం చవిచూశాడు. దీంతో ఆసియా టోర్నీ పురుషుల సింగిల్స్‌లో రెండో స్వర్ణం కోసం 61 ఏళ్లుగా సాగుతున్న భారత్ నిరీక్షణకు తెరపడలేదు. 1965లో భారత్‌కు సింగిల్స్‌లో దినేశ్ ఖన్నా స్వర్ణం అందించాడు. ఆ తర్వాత పురుషుల డబుల్స్‌లో 2023లో సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జోడీ మాత్రమే టైటిల్ సాధించింది. ఇక వరుసగా అగ్రశ్రేణి షట్లర్లను చిత్తుచేస్తూ రెట్టింపు ఉత్సాహంతో ఫైనల్లో అడుగుపెట్టిన ఆయుష్.. ఆఖరి పోరాటంలో నిరాశ పరిచాడు. తన అనుభవాన్నంతా ఉపయోగించి, అత్యున్నత నైపుణ్యం కనబరిచిన చైనా ఆటగాడి ముందు ఆయుష్ తేలిపోయాడు. యుకి షటిల్‌పై పూర్తి నియంత్రణతో ఆడటంతో ఆయుష్‌కు లయ దొరకలేదు. తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిన ఆయుష్ షాట్ల ఎంపికలో తడబడ్డాడు. దీంతో రెండు గేమ్‌ల్లోనూ సాధికారికంగా ఆడిన యుకి.. ఆయుష్‌పై సంపూర్ణ ఆధిపత్యంతో మ్యాచ్ గెలిచాడు.